ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 123, పేజీలు - 08

మంగళవారం, నవంబర్ 3, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

రాహుల్ ప్రధాని కాలేరన్న అమిత్ షా

- తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపణ
- 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని వ్యాఖ్య
- ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని విమర్శ
- ఈవీఎంలపై రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించిన షా
- తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి తీరుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాంలలో గెలిచామని ఇక తదుపరి, తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. అరాచకత్వాన్ని అంతం చేయాలని అన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా ప్రక్రియలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని ప్రతిపక్ష ఇండి కూటమి ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే సీఈసీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఇండి కూటమి చేస్తున్న ప్రచారానికి దీటుగా బీజేపీ దేశవ్యాప్తంగా "లోక్‌తంత్ర బచావో, అరాజక్ హటావో" (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి) కార్యక్రమాన్ని చేపట్టింది. హైదరాబాద్‌లో చేపట్టిన ఈ ర్యాలీకి కేంద్ర హోం మంత్రి అమిత్ షా నాయకత్వం వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారును గద్దె దించేందుకు సంకల్పం తీసుకోవాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో భాజపా సర్కారు రావాలా వద్దా? అని ప్రశ్నించారు. "రేవంత్ రెడ్డి మొత్తం తెలంగాణను ఢిల్లీలో ఉన్న కాంగ్రెస్ నాయకుల కోసం ఒక ఏటీఎంలా మార్చేశారు. దీనిని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. రాహుల్ గారు ఆరు గ్యారంటీలు ఇచ్చారు, కానీ ఒక్క గ్యారంటీని కూడా నెరవేర్చలేదు. ప్రధాని మోదీ ఉగ్రవాదాన్ని అంతం చేస్తామని చెప్పారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్ ద్వారా మేము ఉగ్రవాదంపై చర్యలు తీసుకున్నామా? లేదా?. 2029 డిసెంబర్ 31 లోపు ఈ దేశం నుండి మాదకద్రవ్యాలను (డ్రగ్స్) పూర్తిగా నిర్మూలించి, భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మారుస్తామని మరోసారి చెబుతున్నాం, తెలంగాణలో

2లో..

పశ్చిమాసియా సంక్షోభంలోనూ

భారత్ ఆర్థిక ప్రగతి పరుగులు!

- 2025 నాటికే 50 శాతానికి పైగా నాన్ ఫాసిల్ విద్యుత్ సామర్థ్యం
- 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనమే లక్ష్యం
- భారత్ రెనివబుల్ ఎనర్జీ సమిట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో సంక్షోభ పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయని, ముఖ్యంగా శిలాజ ఇంధనాలపై అతిగా ఆధారపడటం ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇంధన భద్రతకు స్వచ్ఛ ఇంధనమే కీలకమని

2లో..

హైదరాబాద్ మెట్రోకు

నిధుల జోరు

- రూ.275 కోట్లు మంజూరు చేసిన కేంద్రం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించే దిశగా మెట్రో రైలు రెండో దశ పనులకు సంబంధించి కీలక ఆర్థిక కేటాయింపు వెలుగులోకి వచ్చింది. మెట్రో అభివృద్ధి, ప్రాజెక్టు రుణాల చెల్లింపుల కోసం మొత్తం రూ.275 కోట్లను మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో రెండో దశ నిర్మాణ పనుల కోసం రూ.150 కోట్లు మెట్రో ప్రాజెక్టు రుణాల చెల్లింపుల కోసం మరో రూ.125 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

2లో..

చెత్తకు చెక్, ట్రాఫిక్‌కు బ్రేక్!

నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్న సీఎం

- పారిశుధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- ఇంటింటికీ రోజూ చెత్త సేకరణ జరగాల్సిందే
- సింగిల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం ప్రణాళికలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహా నగరం విశ్వ నగరంవైపునకు పరుగులు పెడుతున్న నేపథ్యంలో ఈ నగరాన్ని క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు

2లో..

లక్షమందికి ఫ్రీగా

ఏఐ, క్లౌడ్ ట్రైనింగ్

- అమెజాన్‌తో తెలంగాణ సర్కార్ కీలక ఒప్పందం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సహకారంతో లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ అందించనుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్

2లో..

మురసుపై అప్రమత్తం..

ప్రాణనష్టం జరగొద్దు!

- అర్నబ్‌తో పోలిస్తే తీవ్రత తక్కువే.. అలసత్వానికి తావులేదు

- తుపాను తీరం దాటే వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి - 7 జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచన
- బుడమేరుకు 30 వేల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం - ప్రకాశం బ్యారేజీకి 2.75 లక్షల క్యూసెక్కుల వరద అంచనా
- ఆర్టీజీ కేంద్రం నుంచి అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి (ప్రశ్న న్యూస్) 'అర్నబ్' తుపానుతో పోలిస్తే 'మురసు' తుపాను తీవ్రత తక్కువగానే ఉన్నప్పటికీ ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఆస్తి నష్టాన్ని కూడా సాధ్యమైనంత వరకు తగ్గించాలని స్పష్టం చేశారు. తుపాను సన్నద్ధతపై సోమవారం అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ) కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో మరోసారి సమీక్ష నిర్వహించారు.

2లో..

రాప్తాడు బాలికకు

జగన్ పరామర్శ

- ప్రభుత్వం 50లక్షల పరిహారం అందించాలని డిమాండ్
- కూటమి ప్రభుత్వం ఆదుకోకపోతే తాము ఉన్నామన్న జగన్



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతి భద్రతలకు అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినిపై జరిగిన దాడి ఉదాహరణ అని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. స్కూల్‌తో సంబంధం లేని వ్యక్తి ఎలక్ట్రిక్ రంపం తీసుకొచ్చి, ఏకంగా క్లాస్‌రూమ్‌లోనే, పిల్లలందరి ముందు పదవ తరగతి విద్యార్థిని గొంతు కోయడం అత్యంత హేయమని ఆయన ఆక్షేపించారు. చివరకు స్కూళ్లలో కూడా పిల్లలకు

3లో..

నవంబర్ 11 నుంచి

కేటీఆర్ బస్సు యాత్ర

- 29న భారీ బహిరంగ సభ

- కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్రకు సన్నాహాలు
- మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు యాత్ర
- రైతుల సాగునీటి కష్టాలను ఎండగట్టడమే లక్ష్యం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్న వేళ బీఆర్ఎస్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో నవంబర్ 11వ తేదీ నుంచి బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. గోదావరి జలాలు, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని ఈ యాత్ర సాగనుంది. మరోవైపు తెలంగాణ ఉద్యమంలోని కీలక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2లో..

మల్లారెడ్డి ఫామ్ హౌస్‌పై

హైడ్రా కొరడా

- ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమ కట్టడాలను తొలగింపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) చెరువుల ఆక్రమణలపై హైడ్రా మరోసారి కొరడా ఝుళిపించింది. హైదరాబాద్‌లోని ఫాక్స్ సాగర్ చెరువు పరిరక్షణ, పునరుద్ధరణ లక్ష్యంగా ఆక్రమణల తొలగింపు చేపట్టింది. చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చిన నిర్మాణాలను గుర్తించి కూల్చివేసింది. ఈ క్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబానికి సంబంధించిన ఫామ్‌హౌస్ ప్రహరీ గోడతో పాటు గేటును కూడా నేలమట్టం చేసింది. చెరువు భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్న సంకేతాన్ని

2లో..

ప్రతి మండలంలో కూటమి జెండాలు రెపరెపలాడాలి

- జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని ప్రతి మండలంలోనూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి జెండాలు రెపరెపలాడాలని, ఆ దిశగా ఎంపీటీసీ స్థానాల్లో పైచేయి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీల ముఖ్యనేతలతో ఆయన సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్‌తో పాటు పలువురు

2లో..

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

జరుగుతున్న అవినీతిని, రాష్ట్రాన్ని అమ్మేసే కుట్రను కాంగ్రెస్ పార్టీ ఆపగలదా? ఓవైసీ ఆపగలరా? బీఆర్ఎస్ ఆపగలదా? అంటే లేదు. మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ మాత్రమే దీనిని ఆపగలదు" అని అమిత్ షా పేర్కొన్నారు. "కాంగ్రెస్ పార్టీయే వెంటిలేటర్‌పై ఉంది. ఈ వెంటిలేటర్ పార్టీ మోదీజీతో కలిసి మారథాన్ పరుగెత్తగలదా? రాహుల్ జీ, మోదీజీని మర్చిపోండి. నా తెలంగాణ యువ మోర్చా అధ్యక్షుడు కూడా మిమ్మల్ని ఓడిస్తాడు" అని అమిత్ షా అన్నారు.రాహుల్ ఎప్పటికీ దేశప్రధాని కాలేరని అమిత్ షా విమర్శించారు. గెలిస్తే ప్రజలు గెలిపించినట్టు ఓడితే ఈవీఎంలపై నెపం వేస్తున్నారని మండిపడ్డారు. ఈవీఎంలను రాహుల్‌గాంధీ తప్పు పడుతున్నారని అదే నిజమైతే తెలంగాణలో రేవంత్ ఎలా సీఎం అయ్యారు? అని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎలా గెలుపొందిందని అడిగారు. ఎస్ఐఆర్ వల్ల మోదీ గెలవలేదని ఎస్ఐఆర్ జరగకముందు కూడా అనేక ఎన్నికల్లో మోదీ గెలుపొందారని చెప్పారు. 2014, 2019 ఎన్నికల సమయంలో ఎస్ఐఆర్ ఉందా? అని ప్రశ్నించారు.
ఒక వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో రెండుసార్లు కనిపిస్తే, వాటిలో ఒకదాన్ని తొలగించాలా వద్దా? అని అమిత్ షా ప్రశ్నించారు. "కోట్ల కొద్దీ ఓట్లు తొలగించారని రాహుల్ గాంధీ అంటున్నారు. అది అబద్ధం. 13 కోట్ల ఓట్లలో 6 కోట్లకు పైగా ఓట్లు వేరే ప్రాంతాలకు తరలివెళ్లిన వారివి, 2.8 కోట్ల ఓట్లు మరణించిన వారివి. మరో కోటి ఓట్లు డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి. అసలు లేని కోటి ఓట్లు ఉన్నాయి. వీరంతా బంగ్లాదేశ్ చొరబాటుదారులు. అయినా రాహుల్ గాంధీ వారిని తొలగించడానికి ఇష్టపడటం లేదు" అని అమిత్ షా విమర్శించారు. సర్దార్ పటేల్ లేకుంటే హైదరాబాద్ భారతదేశంలో విలీనం అయ్యేదే కాదని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ నిర్వహించింది ఓట్ బచావో ర్యాలీ కాదని చొరబాటుదారులను రక్షించే ర్యాలీ అని తీవ్రంగా విమర్శించారు. "రాహుల్ గాంధీ రెండు రోజుల క్రితం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. నన్ను అడిగి ఉంటే ఆ మాక్ పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా కాకుండా, ప్రధానమంత్రి అవ్వమని ఆయనకు చెప్పి ఉండేవాడిని. ఎందుకంటే ఆయన నిజమైన పార్లమెంట్‌లో ఎప్పటికీ ప్రధానమంత్రి కాలేరు" అని అమిత్ షా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అక్రమ బంగ్లాదేశీ చొరబాటుదారులను కాంగ్రెస్ పార్టీ రక్షిస్తోందని ఆరోపించారు. పార్లమెంటు లోపల ప్రత్యక్ష చర్చకు రావాలని ఇండి కూటమికి సవాలు విసిరారు. తాము పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఇక, ఈ కార్యక్రమం కోసం అమిత్ షా సోమవారం మధ్యాహ్నం బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి చార్మినార్ చేరుకుని భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాల ముందున్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. అక్కడి నుంచి ఎంజీ మార్కెట్ వరకు సాగిన పాదయాత్రలో పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పశ్చిమాసియా సంక్షోభంలోనూ
భారత్ ఆర్థిక ప్రగతి పరుగులు!

పేర్కొన్నారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన 'భారత్ రెనివబుల్ ఎనర్జీ సమిట్ అండ్ ఎక్స్‌పో 2026'ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రపంచ సంక్షోభాలు ప్రతి దేశానికీ ఇంధన భద్రత, ఆర్థిక స్థిరత్వం మధ్య ఉన్న విడదీయలేని సంబంధాన్ని గుర్తుచేస్తున్నాయని అన్నారు. శిలాజ ఇంధన నిల్వలు కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉన్నప్పటికీ, సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రతి దేశం తన ప్రాంతంలో అందుబాటులో ఉన్న స్వచ్ఛ ఇంధన వనరులను వినియోగించుకోవచ్చని సూచించారు.

సంక్షోభాలను తట్టుకున్నది ముందుచూపుతోనే!

గత దశాబ్ద కాలంగా భారత్ అనుసరిస్తున్న ముందుచూపుతో కూడిన ఇంధన విధానాలు, దేశీయ పెట్టుబడులు, కీలక కార్యక్రమాల అమలు అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావాన్ని తగ్గించాయని మోదీ తెలిపారు.

పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని చెప్పారు. దేశ స్వచ్ఛ ఇంధన ప్రస్థానం కేవలం జల, సౌర, పవన, అణు విద్యుత్ వనరులకే పరిమితం కాలేదని, గ్రీన్ హైడ్రోజన్ రంగంలోనూ ముందడుగు వేస్తోందని వివరించారు. పారిస్ ఒప్పందం ప్రకారం మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 50 శాతానికి పైగా శిలాజయేతర ఇంధన వనరుల వాటాను సాధించాలనే లక్ష్యాన్ని 2030 నాటికి చేరుకోవాల్సి ఉండగా, భారత్ ఐదేళ్ల ముందుగానే 2025లోనే ఆ ఘనత సాధించిందని వెల్లడించారు. ప్రస్తుతం దేశ మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో నాన్ ఫాసిల్ ఇంధన వనరుల వాటా 50 శాతానికి మించిందన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే కాప్26 లక్ష్యం దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందని, ఇప్పటికే దాదాపు 300 గిగావాట్ల మైలురాయిని చేరుకుందని తెలిపారు. రానున్న 10-11 ఏళ్లలో అదనంగా మరో 500 గిగావాట్ల శిలాజయేతర విద్యుత్ సామర్థ్యాన్ని జోడించడమే తదుపరి లక్ష్యమని ప్రకటించారు.

65 లక్షల ఇళ్లకు సూర్య ఘర్ వెలుగులు

ప్రజలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మంచి ఫలితాలిస్తున్నాయని ప్రధాని తెలిపారు.
గృహాలపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు ఉద్దేశించిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా గత రెండేళ్లలో 65 లక్షలకుపైగా ఇళ్లకు సోలార్ విద్యుత్ సదుపాయం అందించినట్లు వెల్లడించారు. 2024 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా కోటి కుటుంబాలకు ప్రయోజనం కల్పించాలనేది లక్ష్యమని చెప్పారు. సోలార్ విద్యుత్ వినియోగంతో ఆయా కుటుంబాల విద్యుత్ బిల్లులు సుమారు 76 శాతం తగ్గాయని వివరించారు.

రైతులకు ఏటా రూ.లక్ష వరకు ఆదా

పీఎం-కుసుమ్ పథకం కింద 30 లక్షలకుపైగా రైతులు సౌర విద్యుత్ వ్యవస్థల ద్వారా ప్రయోజనం పొందుతున్నారని మోదీ తెలిపారు. ఈ పథకం ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి సుమారు రూ.లక్ష వరకు ఆదా అవుతున్నట్లు అంచనా వేశారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 44 వేలకుపైగా ప్రభుత్వ భవనాలపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ వ్యవస్థల వల్ల ఏటా దాదాపు రూ.700 కోట్ల మేర విద్యుత్ ఖర్చు ఆదా అవుతోందని వెల్లడించారు. స్వచ్ఛ ఇంధన వినియోగం పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు, సామాన్య ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుస్తోందని ప్రధాని వివరించారు.

హైదరాబాద్ మెట్రోకు
నిధుల జోరు

ఈ నిధుల కేటాయింపు ద్వారా మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక అవసరాలను కొంతవరకు సమకూర్చడంతో పాటు విస్తరణ పనులపై ముందడుగు వేసేందుకు అవకాశం ఏర్పడనుంది.హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న మెట్రో మార్గాలు నగరంలోని కొన్ని ప్రధాన ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ఐటీ కారిడార్, పాతబస్తీ, శివారు ప్రాంతాలు, విమానాశ్రయ మార్గం వంటి ప్రాంతాలకు మెట్రో సేవలను విస్తరించాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో రెండో దశ ప్రాజెక్టుపై నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశలో భాగంగా తొలుత ఐదు కారిడార్లను 76.4 కిలోమీటర్ల మేర విస్తరించే ప్రతిపాదన రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు అంచనా వ్యయం రూ.24,269 కోట్లు కాగా ఈ 5 కారిడార్ల ప్రతిపాదనను 2024లో తెలంగాణ ప్రభుత్వం పరిపాలనాపరంగా ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించింది.ఆ తర్వాత నగర విస్తరణ, పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 7 కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరణకు రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేంద్రానికి సమర్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే నెలలో వెల్లడించింది. ఈ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కోరారు. రెండో దశలో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో కనెక్టివిటీ, పశ్చిమ హైదరాబాద్‌లోని కోకాపేట నియోపోలిస్ ప్రాంతానికి విస్తరణ, పాతబస్తీలో చాంద్రాయణగుట్ట వరకు మెట్రో మార్గం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. అలాగే మియాపూర్ నుంచి పటాన్‌చెరు, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ మార్గాల్లోనూ మెట్రో సేవలను విస్తరించే ప్రణాళిక ఉంది. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ కల్పించే కారిడార్లను కూడా చేర్చారు. ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నగరంలోని ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రోజువారీ ప్రయాణికులకు రవాణా సౌకర్యం మెరుగుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా రోడ్లపై వాహనాల రద్దీ తగ్గించడంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణానికి ప్రజా రవాణా ప్రత్యామ్నాయం పెరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. తాజాగా కేటాయించిన రూ.275 కోట్లతో మెట్రో విస్తరణకు సంబంధించిన ఆర్థిక కార్యాచరణలో ఒక కీలక ముందడుగుగా రేవంత్ సర్కార్ భావిస్తోంది. అయితే రూ.24,269 కోట్ల అంచనా వ్యయమున్న 5 కారిడార్ల ప్రాజెక్టు రూ.38,595 కోట్ల విస్తృత ప్రతిపాదన మొత్తం అమలుకు ఇంకా భారీ స్థాయిలో నిధులు, అనుమతులు, నిర్మాణ ఒప్పందాలు అవసరం కానున్నాయి.

చెత్తకు చెక్,ట్రాఫిక్‌కు బ్రేక్!

తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ఇన్ఫ్రస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు ఐలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.అలాగే నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో గ్రీన్ ట్యాంకర్స్ ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సీఎం అధికారుకు సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ మెయింటెనెన్స్, పార్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీటిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకే జలమండలి తొలివిడతలో 19 మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. జీహెచ్ ఎంసీతో పాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సరఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచించారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు.

లక్షమందికి ఫ్రీగా ఏఐ, క్లౌడ్ ట్రైనింగ్

అండ్ నాలెడ్జ్ (టాస్క్), ఏడబ్ల్యూఎస్ మధ్య సోమవారం కీలక ఒప్పందం కుదిరింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా టెక్నికల్స్ స్కిల్స్ నేర్పించనున్నారు. ప్రభుత్వానికి, కళాశాలలకు, విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగ మార్కెట్‌లో వేగంగా ప్రాధాన్యం పెరుగుతున్న ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై యువతకు అవగాహనతో పాటు ప్రాక్టికల్ అనుభవం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి విభాగాల్లో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. కేవలం క్లాస్ రూం పాఠాలకే పరిమితం కాకుండా.. ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ ద్వారా ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశాన్ని కూడా విద్యార్థులకు కల్పిస్తారు. దీనివల్ల విద్యార్థులు రియల్ టైమ్ టెక్నాలజీపై పనిచేసే అనుభవాన్ని పొందవచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులకే కాకుండా ఆర్ట్స్, కామర్స్ వంటి నాన్ స్టెమ్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్‌లు అందుబాటులో ఉంటాయి. అంటే టెక్నికల్ విద్యను చదవని విద్యార్థులు కూడా.. వారు చదువుకున్న విద్యకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. ఈ ట్రైనింగ్ తీసుకునే విద్యార్థులకు ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులను ఫ్రీగా అందించనున్నారు.అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లను కూడా ఇవ్వనున్నారు. అలాగే సాంకేతిక రంగ నిపుణులతో ప్రత్యేకంగా ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు, హ్యాకథాన్‌లు నిర్వహించనున్నారు. వీటి ద్వారా పరిశ్రమల అవసరాలు, కొత్త టెక్నాలజీల వినియోగం, సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. సక్సెస్‌ఫుల్‌గా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. విద్యార్థులతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొనే కాలేజీల అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై శిక్షణ అందించనున్నారు. తద్వారా కాలేజీల్లో సాంకేతిక విద్యా బోధన సామర్థ్యాన్ని పెంచేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులకు అందించే శిక్షణ మరింత సమర్థంగా కొనసాగేందుకు అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కూడా దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని లక్ష మంది విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ రంగాల్లో శిక్షణ పొందే అవకాశం లభించనుంది. ముఖ్యంగా సంప్రదాయ డిగ్రీ కోర్సులు చదువుతున్నవారికి కూడా కొత్త సాంకేతిక రంగాల్లోకి అడుగుపెట్టేందుకు ఇది ఒక అవకాశంగా నిలవనుంది.

మురసుపై అప్రమత్తం.. ప్రాణనష్టం జరగొద్దు!

ఈ టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన సుమారు 45 వేల మంది క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. తుపాను ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు.

ఏడు జిల్లాలకు భారీ వర్ష సూచన

'మురసు' తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చంద్రబాబు తెలిపారు. ముఖ్యంగా పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడవచ్చని వివరించారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు కోస్తాంధ్రపై తుపాను ప్రభావం ఉంటుందని అంచనా వేశారు. రాష్ట్రంలోని 848 స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల పరిధిలో దీని ప్రభావం కనిపించే అవకాశం ఉందన్నారు. ప్రతి గంటకూ వాతావరణ పరిస్థితులు, తుపాను హెచ్చరికలను రియల్‌టైమ్‌లో ప్రజలకు చేరవేయాలని అధికారులను ఆదేశించారు.

బుడమేరుకు 30 వేల క్యూసెక్కుల వరద!

తుపాను ప్రభావంతో నాగార్జునసాగర్, పులిచింతల, బుడమేరు క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని సీఎం హెచ్చరించారు. ముఖ్యంగా మంగళవారం నాటికి బుడమేరుకు 30 వేల క్యూసెక్కుల వరద చేరవచ్చని అంచనా వేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని జలవనరుల శాఖను ఆదేశించారు. నవంబర్ 4 నాటికి కృష్ణా నదిపై ఉన్న ప్రకాశం బ్యారేజీకి 2.75 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చే అవకాశం ఉందని, ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పడుతుందని తెలిపారు. గుండ్లకమ్మకు కూడా వరద ప్రవాహం ఉండే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యుత్ పునరుద్ధరణకు 5 వేల మంది సిద్ధం

భారీ గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకూలి సరఫరాకు అంతరాయం కలిగే ప్రమాదం ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం 5 వేల మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. గుంటూరు, నెల్లూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థపై తుపాను ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14,760 చిన్న నీటిపారుదల చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆక్వా, ఉద్యానవన పంటలపై కూడా తుపాను ప్రభావం ఉండవచ్చని హెచ్చరించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించండి

గతంలో 'అర్నబ్' తుపాను సమయంలో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల నష్టాన్ని చాలావరకు తగ్గించగలిగామని చంద్రబాబు గుర్తుచేశారు. ఈసారి కూడా ప్రాణనష్టం లేకుండా, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగితే ప్రజల్లో ప్రభుత్వంపై మరింత భరోసా పెరుగుతుందని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు, తుపాను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది చిన్నపాటి నిర్లక్ష్యానికి కూడా తావివ్వకూడదని స్పష్టం చేశారు. తుపాను తీరం దాటి ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో పనిచేయాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు.

సీఈఓ తెలంగాణ ఆన్లైన్ వెబ్సైట్‌లో నెలకొన్న
సాంకేతిక సమస్యని వెంటనే పరిష్కరించాలి

తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ నిన్నటి నుండి పనిచేయడం లేదని, సాంకేతిక సమస్యల కారణంగా అందుబాటులో లేకపోవడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియ తీవ్రంగా ప్రభావితమవుతోందని తెలిపిన సామ.గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు చివరి తేదీ 6 నవంబర్ 2026గా నిర్ణయించబడిన నేపథ్యంలో, ఈ కీలక సమయంలో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడం వల్ల ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే వేలాది మంది అర్హులైన గ్రాడ్యుయేట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ఈ నేపథ్యంలో, మీ కార్యాలయం వెబ్‌సైట్‌ను తక్షణమే పునరుద్ధరించి, ఎటువంటి ఆలస్యం లేకుండా ఓటరు నమోదు సేవలను తిరిగి ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.వెబ్‌సైట్ పనిచేయని రోజుల సంఖ్యకు సమానంగా ఓటరు నమోదు గడువును పొడిగించాలి. తద్వారా సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన ఏ గ్రాడ్యుయేట్ కూడా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని వినతి పత్రం అందజేశారు.

నవంబర్ 11 నుంచి
కేటీఆర్ బస్సు యాత్ర

ఈ సభకు సుమారు 50 వేల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడించారు. కేటీఆర్ బస్సు యాత్ర నవంబర్ 11వ తేదీ నుంచి 14వ తేదీ మధ్య 2 రోజులపాటు నిర్వహించనున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో బస్సు యాత్ర మార్గం, దీక్షా దివస్ సభ నిర్వహణ, రైతుల సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే కేటీఆర్ బస్సు యాత్ర గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా కొనసాగనుంది.ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు వాటి ద్వారా సాగునీరు అందే ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. సాగునీటితో పాటు తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కూడా యాత్రలో ప్రస్తావించనున్నారు. సాగునీటి అంశాన్ని రాజకీయ చర్చలోకి తీసుకురావడం ద్వారా రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని గులాబీ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజలకు వివరించేందుకు ఈ యాత్రను వేదికగా చేసుకోనున్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షకు సంబంధించిన జ్ఞాపకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబర్ 29వ తేదీన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 2009 నవంబర్ 29వ తేదీన అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను అలుగునూర్ వద్ద పోలీసులు అరెస్టు చేసిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేయనున్నారు. ఈ చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతంలోనే సభ నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని అలుగునూర్ లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో సభ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు.
ఈ దీక్షా దివస్ కార్యక్రమానికి సుమారు 50 వేల మందిని సమీకరించాలని బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు గంగుల చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దీక్షా దివస్‌కు ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై దృష్టి పెట్టనున్నారు. బస్సు యాత్ర, దీక్షా దివస్ సభ ఏర్పాట్లు, యాత్రలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకోవడం, ప్రాజెక్టుల పరిస్థితిపై వివరాలు సేకరించడం, సభకు జనసమీకరణ వంటి అంశాలపై నేతలు తాజాగా చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 3 ఏళ్లు కావస్తుండగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 2 ఏళ్ల సమయం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ కూడా రాష్ట్రంలో కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్ర, దీక్షా దివస్ సభకు ప్రాధాన్యత ఏర్పడింది. మొత్తంగా మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు కేటీఆర్ బస్సు యాత్ర, అలుగునూర్ ప్రాంతంలో దీక్షా దివస్ సభతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి నీటి ప్రాజెక్టులు, రైతుల సమస్యలు ప్రధాన చర్చకు వచ్చే అవకాశం ఉంది.

మల్లారెడ్డి ఫామ్ హౌస్‌పై
హైడ్రా కొరడా

ఈ చర్య ద్వారా హైడ్రా ఇచ్చింది. సోమవారం చేపట్టిన ఈ కూల్చివేతలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఫాక్స్ సాగర్ చెరువు పరిధిలోని దూలపల్లి గ్రామంలో మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబీకులకు సంబంధించిన ఫామ్‌హౌస్ ఉంది. గ్రామంలోని సర్వే నంబర్ 124లో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే భూమిని ఫామ్‌హౌస్ ప్రహరీలో కలిపినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. సుమారు 15 ఎకరాల మేర చెరువు ఎఫ్‌టీఎల్ భూమి ఫామ్‌హౌస్ సరిహద్దుల్లోకి వచ్చినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం. అంతేకాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో మట్టిని నింపి భూమి ఎత్తును పెంచిన తర్వాత ప్రహరీ గోడ నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. దీనికి తోడు ప్రవేశ ద్వారం వద్ద గేటును కూడా ఏర్పాటు చేశారు. చెరువు హద్దులను పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టడంపై చర్యలు తీసుకున్న హైడ్రా సిబ్బంది ప్రహరీ గోడతో పాటు గేటును తొలగించారు. ఫాక్స్ సాగర్ చెరువు మరోవైపు కూడా హైడ్రా ఆక్రమణల తొలగింపు చేపట్టింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో దాదాపు అర కిలోమీటరు మేర బండ్ నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. ఆ బండ్‌ను ఆనుకుని ఫామ్‌హౌస్ సరిహద్దుగా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేశారు. కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇనుప కంచెలను సైతం తొలగించారు. చెరువు నీరు నిల్వ ఉండాల్సిన ప్రాంతంలో మట్టి పోసి, బండ్‌లు, ప్రహరీలతో హద్దులు ఏర్పాటు చేయడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. చెరువు అసలు విస్తీర్ణాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్తులో నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతినకుండా చూడటమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. హైడ్రా చర్యలు దూలపల్లికే పరిమితం కాలేదు. జీడిమెట్ల పరిధిలోని సర్వే నంబర్లు 41, 42లోనూ ఆక్రమణల తొలగింపు చేపట్టింది. ఈ ప్రాంతంలో ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్న సుమారు 20 ఎకరాల భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడను తొలగించింది. దీంతో ఒకే రోజు చెరువు పరిసరాల్లోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలపై అధికారులు చర్యలు చేపట్టినట్లయింది.
ఈ కూల్చివేతల సమయంలో సుప్రీంకోర్టు లాయర్ సౌరభ్‌రాజ్ వర్మ అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

తన తండ్రి దీపక్ వర్మ, పినతండ్రి ప్రశాంత్ వర్మలకు వారసుడిగా ఆస్తిపై హక్కులు ఉన్నాయని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే హైడ్రా అధికారులు చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను చూపిస్తూ తమ చర్యలను కొనసాగించారు. ఆక్రమణలుగా గుర్తించిన నిర్మాణాలను తొలగించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమైన జలవనరుల్లో ఫాక్స్ సాగర్ చెరువు ఒకటి. నగర విస్తరణతో చెరువుల చుట్టూ ఆక్రమణలు పెరగడం, మట్టి నింపి నిర్మాణాలు చేపట్టడం వంటి పరిణామాలు జలవనరుల పరిరక్షణకు సవాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులను గుర్తించి ఆక్రమణలను తొలగించడంపై హైడ్రా దృష్టి సారించింది. ఫాక్స్ సాగర్ చెరువు అసలు హద్దులను పునరుద్ధరించి, నీటి నిల్వ ప్రాంతాన్ని పరిరక్షించేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం ఆక్రమణలు తొలగించడమే కాకుండా చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కూడా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ఫాక్స్ సాగర్ వద్ద హైడ్రా చేపట్టిన తాజా కూల్చివేతలు నగరంలోని చెరువుల పరిరక్షణ అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయి. రాజకీయ ప్రముఖుల కుటుంబాలకు సంబంధించిన నిర్మాణాలైనా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్న హైడ్రా వైఖరి ఈ ఘటనతో చర్చనీయాంశమైంది.

ప్రతి మండలంలో కూటమి జెండాలు
రెపరెపలాడాలి

ముఖ్య నేతలు పాల్గొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానాలనూ కూటమి పార్టీలే కైవసం చేసుకోవాలని, అందుకు అనుగుణంగా జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రభుత్వమే ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ప్రతి ఇంటికీ సంక్షేమం అందించామని గుర్తుచేశారు. ప్రజల ఆశలు నెరవేర్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.ఈ లక్ష్య సాధన కోసం కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి స్ఫూర్తితో అందరూ ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్నారు.
స్థానిక ఎన్నికలపై తాను, పవన్ కల్యాణ్, మాధవ్ నిరంతరం చర్చించుకుంటున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో మాత్రం పెద్ద ఎత్తున పోలింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. కూటమి ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పులివెందులలో హింస సృష్టించేందుకు కొందరు ప్రయత్నించినా కూటమి నేతలు సంయమనం పాటించారని అభినందించారు. త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవైపు ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, మరోవైపు 'అర్నబ్', 'మురసు' తుపానుల సహాయక చర్యలను సమర్థంగా చేపడుతున్నామని, విరిగిన స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను గాడిలో పెట్టామని చంద్రబాబు వివరించారు. ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబరు 5న జరగనుండగా, నవంబరు 7న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

పిఠాపురంలో ఉద్రిక్తత..

పోలింగ్ బూత్ వద్ద ఎంపీ తంగెళ్ల, ఎమ్మెల్యే నానాజీ ఆందోళన



పిఠాపురం పిఠాపురం మున్సిపల్ ఎన్నికల ముగింపు నేపథ్యంలో ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. పోలింగ్ అధికారులు వైకాపాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ జనసేన నాయకులు ఆందోళన నిర్వహించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే నానాజీ, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తదితరులు ఆందోళన నిర్వహించారు. పోలింగ్ బూత్ లోకి వెళ్లేందుకు వారు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. స్థానిక రథాల పేట, అంగన్ వాడీ కేంద్రం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ 18, 19 వార్డుల పోలింగ్ బూత్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ ముగిసే సమయంలో 18వ వార్డు వైకాపా అభ్యర్థి పచ్చిమళ్ల జ్యోతి, స్వతంత్ర అభ్యర్థి కూసి లక్ష్మి వున్నారు. ఆ సమయంలో బూత్ లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన జనసేన అభ్యర్థి దాసరి సునీత ప్రయత్నించగా ఆమెను పోలింగ్ అధికారులు అడ్డుకున్నారు. విషయం తెలిసిన వెంటనే ఉదయ్ శ్రీనివాస్, పెండెం దొరబాబు, నానాజీ తదితరులు పోలింగ్ బూత్ కు చేరుకున్నారు. పోలీసు అధికారుల తీరుపై మండిపడ్డారు. వైకాపాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డీఎస్పీ దుర్గారావు తదితరులను నిలదీశారు. తక్షణం పోలింగ్ రద్దు చేసి రీ పోలింగ్ నిర్వహించాలని పట్టుబట్టారు. గేట్లు తీసుకుని బూత్ లోనికి వెళ్లేందుకు వారు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పింది. చివరికి ఎంపీ తంగెళ్ల, రూరల్ ఎమ్మెల్యే నానాజీలను అనుమతించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఇదిలా వుండగా విషయం తెలుసుకుని మాజీ ఎంపీ వంగా గీత సైతం పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలను బూత్ లోకి ఎలా అనుమతిస్తారని వారిని వెంటనే బయటికి పంపాలని పట్టుబట్టారు. చివరికి భారీ బందోబస్తు మధ్య పోలింగ్ బాక్స్ లను స్ట్రాంగ్ రూం కు తరలించారు. కాగా వైకాపా అభ్యర్థి పచ్చిమళ్ల జ్యోతి భర్త పోలింగ్ ఏజెంట్ అప్పలరాజు ఓటు వేయడానికి లైన్ లో నిలుచోవడంతో ఈ వివాదానికి కారణంగా తెలుస్తోంది. జనసేన ఏజెంట్లను బయటికి పంపి అప్పల రాజును ఎలా అనుమతిస్తారని జనసైనికులు నిలదీయడంతో గొడవ జరిగినట్లు సమాచారం.

టిడిపి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం..

- గ్రామాభివృద్ధికి హామీలు - గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం
- జడ్పీటీసీ అభ్యర్థి ఉలిగయ్య - అన్ని గ్రామాల్లో ఉపందుకున్న టీడీపీ ప్రచారం



కౌతాళం :కౌతాళం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఎంపీపీ అభ్యర్థి వల్లూరి సురేఖ మండల జడ్పీటీసీ అభ్యర్థి సీనియర్ నాయకులు ఉలిగయ్య గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని అభ్యర్థులు తెలిపారు.గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల ఏర్పాటు, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటు వంటి మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని జడ్పీటీసీ అభ్యర్థి ఉలిగయ్య పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన ఇతర అభివృద్ధి పనులను కూడా గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని వెల్లడించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా విజయం సాధించిన తర్వాత కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామని అభ్యర్థులు భరోసా ఇచ్చారు.ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో స్థానిక నాయకులు టీడీపీ నాయకులు, సురేష్ నాయుడు,కుంబలూరు చిన్న, వెంకట రెడ్డి, మోహన్ రెడ్డి లక్కే గోవిందు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని ఘనంగా సన్మానించిన గుంత రఘు





తుగ్గలి: తుగ్గలి మండల పరిధిలోని గల ఎర్రగుడి,ఉప్పర్లపల్లి,జొన్నగిరి గ్రామాలలో జరిగిన ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిను వైసీపీ నాయకులు గుంత రఘు,గుంత దేవి లు సోమవారం రోజున ఘనంగా సన్మానించారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యేకు శాలువా కప్పి,పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు.అనంతరం జరిగిన ప్రచార కార్యక్రమంలో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుంత రఘు మాట్లాడుతూ కంగాటి శ్రీదేవి హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని కొనియాడారు.ఆమె నాయకత్వంలో తుగ్గలి మండలంలో వైసీపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్లందరూ మూడు ఓట్లను ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను ఆఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పగిడిరాయి జగన్నాథ్ రెడ్డి,జడ్పీటిసి అభ్యర్థి సునీత, జొన్నగిరి గ్రామ ఎంపీటీసీ అభ్యర్థులు తుప్పేట లక్ష్మి,తలారి కోదండ,గుంత ఆంజనేయులు,మనోహర్,ఎర్ర నాగప్ప,వైసీపీ నాయకులు,తేరప్ప, పకీరప్ప,తదితర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అదితి గోక్షేత్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న

స్పీకర్ ప్రసాద్ కుమార్



వికారాబాద్ నవాబ్‌పేట మండలం వట్టిమీనపల్లి గ్రామంలోని గోవర్ధనగిరిపై నూతనంగా నిర్మించిన శ్రీ అదితి గోక్షేత్రం ప్రారంభోత్సవం, శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహాల దివ్య ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాల్లో తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.అవధూత దత్తపీఠాధిపతి పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ వారి దివ్య హస్తాలతో గోక్షేత్రం ప్రారంభం కాగా, స్వామిజీ వారి ఆశీస్సులను స్పీకర్ అందుకున్నారు.ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో గోమాతకు విశిష్ట స్థానం ఉందని, గోరక్షణ, గోసేవ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. గోక్షేత్రం గోవుల సంరక్షణతో పాటు ఆధ్యాత్మిక చైతన్యానికి, సమాజ సేవకు కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్వామిజీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గోసేవకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరణించిన హోంగార్డుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా...పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన హోంగార్డుల కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం వుంటుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అన్నారు. ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా ఆర్థిక సహాయం మంజూరు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తూ మరణించిన హోంగార్డులు సుబ్బరాజు, శంకరయ్య కుటుంబాలకు ఎక్స్గ్రేషియా మంజూరైంది. ఈ సందర్భంగా ఎక్స్గ్రేషియా మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేక చొరవ తీసుకున్న పోలీస్ శాఖకు హోంగార్డుల కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉండగా లేదా ఇతర కారణాలతో మరణించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, హోంగార్డుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీస్ కుటుంబాల్లో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు వారికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరి కుటుంబ సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, మరణించిన హోంగార్డుల కుటుంబాలకు అన్ని విధాల అండగా వుంటామని అన్నారు.

ఎంపీటీసీ సుమలతకు ప్రచారం

నిర్వహినీచీన ముక్కా, కస్తూరి, కేకే, మాచినేని



చిట్వేలి చిట్వేలి మండలం కేఎన్. అగ్రహారంలో ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. తెలుగుదేశం పార్టీ మద్దతుతో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాటూరు సుమలత తరఫున ఆమె భర్త, టీడీపీ సీనియర్ నాయకులు పాటూరు శ్రీనివాసులు రెడ్డి కెఎన్.అగ్రహారంలో ముఖ్య నాయకులతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ బాధ్యులు ముక్కా రూపానంద రెడ్డి, మాజీ బాధ్యులు కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరి, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు ముఖ్య నాయకులు హాజరై పాటూరు కుటుంబానికి తమ మద్దతు ప్రకటించారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుని ఎంపీటీసీ అభ్యర్థి పాటూరు సుమలత కు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేఎన్.అగ్రహారం పంచాయతీ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఎన్నికల బరిలో నిలిచిన పాటూరు సుమలత కు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మమేకం అవుతూ సాగిన ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలువురు కూటమి నేతలు, స్థానిక కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకుల రాకతో గ్రామంలో ఎన్నికల ప్రచారం మరింత సందడిగా సాగింది.

రాప్తాడు బాలికకు జగన్ పరామర్శ

రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో ఉన్మాది చేతిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టెన్త్ విద్యార్థిని గోపికను వైయస్ జగన్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడిన ఆయన బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. పాప ఆరోగ్యం కాస్త మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పడం, కాస్త సంతోషించతగిన విషయమని, బాలిక పరామర్శ అనంతరం జగన్ మాట్లాడుతూ చెప్పారు.స్కూళ్లలో చదువుకునే పిల్లల భద్రత ఎక్కడ అని ప్రశ్నించారు. ఇది వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ వైఫల్యమే అన్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా విస్తరిస్తున్నాయి. గంజాయి, మద్యం అందుబాటులోకి రావడంతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ పరిస్థితుల వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని జగన్ పేర్కొన్నారు. వీటిని నియంత్రించలేకపోతున్నందుకు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఒక అమాయక బాలిక నేడు చావుబతుకుల మధ్య పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందని, బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షల పరిహారం అందించాలి. అంతే కాకుండా బాలికకు అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో అందించాలని జగన్ డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలన్నారు.ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆ కుటుంబానికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. బాలిక వైద్యానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం ఇవ్వకపోతే, వైయస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ కుటుంబానికి రూ.50 లక్షలు అందిస్తాం అని జగన్ ప్రకటన చేశారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం అన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, శాంతిభద్రతలను పూర్తిగా గాలికొదిలేశారు. పోలీసుల దృష్టి శాంతిభద్రతల పరిరక్షణపై కాకుండా రాజకీయ వ్యవహారాలపై ఉండే పరిస్థితి తీసుకొచ్చారు. అందుకే రాష్ట్రంలో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయన్నారు. ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే గత 15-16 నెలల్లో తొమ్మిది దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు జగన్. వాటిలో ఆరు ఘటనలు మహిళలు, బాలికలకు సంబంధించినవే కావడం ఆందోళనకరం అని పేర్కొన్నారు. ఇది ప్రస్తుత ప్రభుత్వ అసమర్థతకు, వైఫల్యానికి నిదర్శనం అన్నారు.

గోపిక చికిత్సకు రూ.2 లక్షలు విడుదల

- బాలిక కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

- చికిత్సకు స్పందిస్తున్న బాలిక.. వైద్యుల కృషికి మంత్రి అభినందనలు

అమరావతి అనంతపురం జిల్లా రాప్తాడులో దాడికి గురై తీవ్రంగా గాయపడిన బాలిక గోపికకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.2 లక్షలు విడుదల చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం అనంతపురం సర్వజన ఆసుపత్రి వైద్యశాల అభివృద్ధి నిధుల నుంచి ఈ మొత్తాన్ని బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి చెల్లించారు.ఇప్పటికే మంత్రి సత్యకుమార్ యాదవ్ తన వ్యక్తిగత ఆర్థిక సాయం కింద బాలిక కుటుంబానికి రూ.లక్ష అందించారు. బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.క్రమంగా మెరుగుపడుతున్న ఆరోగ్యంతీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చేరిన గోపికకు వైద్యులు తక్షణ చికిత్స అందించారు. ఎనిమిది ప్యాకెట్ల రక్తం ఎక్కించి, రక్తస్రావాన్ని నియంత్రించేందుకు అత్యవసర చికిత్స చేపట్టారు.అనంతరం మంత్రి చొరవతో బాలికను మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులతో మంత్రి నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు.సోమవారం వైద్యులు వెల్లడించిన వివరాల ప్రకారం గోపిక రక్తపోటు క్రమంగా అదుపులోకి వస్తోంది. మూత్ర విసర్జన వ్యవస్థ మెరుగుపడటంతో పాటు మూత్రపిండాల పనితీరు సాధారణ స్థాయిలో ఉన్నట్లు రక్త పరీక్షల్లో వెల్లడైంది.వైద్య బృందానికి మంత్రి అభినందనలుమణిపాల్ ఆసుపత్రిలో గోపికకు చికిత్స అందిస్తున్న డాక్టర్ మయూర్ శెట్టి, డాక్టర్ లాల్‌చంద్, డాక్టర్ శిజు, డాక్టర్ కౌశిక్, డాక్టర్ రవికిరణ్‌లతో మంత్రి మాట్లాడి వారి సేవలను అభినందించారు.అలాగే అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ హరికృష్ణ, మహేష్, సాంకేతిక నిపుణుడు గౌసులను కూడా మంత్రి ప్రశంసించారు.వారి వేగవంతమైన స్పందన, సేవలను గుర్తించిన వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎ. విష్ణువర్ధన్ ప్రశంసా లేఖలు పంపించారు.బాలికకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం, వైద్య బృందాలు ప్రత్యేక శ్రద్ధ కొనసాగిస్తున్నాయి.

మురసు తుఫాన్ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మురసు తుఫాన్ నేపథ్యంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుఫాన్ ప్రభావం, భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సమీక్షించారు.ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, వివిధ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లు (సీఈలు), సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఈరోజు సాయంత్రం నెల్లూరు?ఒంగోలు మధ్య మురసు తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నందున అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కృష్ణా, పెన్నా నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఇరిగేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.నాగార్జునసాగర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అక్కడి నుంచి వచ్చే వరద ప్రవాహాలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. గుండ్లకమ్మ, రాళ్లపాడు రిజర్వాయర్లకు వరద వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాజెక్టుల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ప్రతి రెండు గంటలకు ఒకసారి రిజర్వాయర్లలోకి వస్తున్న నీటి ప్రవాహాలు, నీటిమట్టాలు, విడుదల చేస్తున్న నీటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని స్పష్టం చేశారు.తుఫాన్ ప్రభావంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ఫ్లడ్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఫ్లడ్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణం, వరద పరిస్థితులపై సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు.తుఫాన్ ప్రభావంతో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టంతో పాటు పంట నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు.

రాప్తాడు దాడి బాలిక ఆరోగ్యంపై మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్

అనంతపురం, అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ స్కూల్లో రంపం దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంపై కీలక అప్డేట్ వచ్చింది. టెన్త్ విద్యార్థిని గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోంది. బాలిక త్వరగా కోలుకుంటోందని, నేటి సాయంత్రం ఆమెకు వెంటిలేటర్ సపోర్ట్ తొలగించాలని బెంగళూరులోని మణిపాల్ హాస్పిటల్ డాక్టర్లు భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఏపీ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ రోజు ఉదయాన్నే ఎంతో సంతోషాన్ని కలిగించే వార్తను డాక్టర్లు అందించారు. రాప్తాడులో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన టెన్త్ విద్యార్థిని గోపిక ఆరోగ్యం మెరుగుపడుతోంది. ప్రస్తుతం డాక్టర్ల సూచనలను అర్థం చేసుకుని బాలిక స్పందిస్తోంది. ఆ విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం ఎంతో ఊరటనిస్తుంది. బాధిత విద్యార్థిని త్వరగా పూర్తిగా కోలుకుని, చిరునవ్వులతో మన ముందుకు రావాలని నారా లోకేష్ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. రాప్తాడులో జరిగిన దాడికి గురైన రెండో విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ఆంధ్రప్రదేశ్ మొత్తం ప్రార్థిస్తుందని, గోపికను కాపాడేందుకు ప్రయత్నించిన స్నేహితురాలు లక్ష్మి విషయాన్ని నారా లోకేష్ ప్రస్తావించారు. 'ఓ వ్యక్తి ఎలక్ట్రిక్ రంపంతో వారి స్కూల్లోకి ప్రవేశించినప్పుడు, లక్ష్మి భయపడి పారిపోలేదు. ఆమె ముందడుగు వేసి తన స్నేహితురాలికి రక్షణగా నిలిచింది, ఆ క్రమంలో తీవ్రంగా గాయపడింది. తన ప్రాణాలను తాను కాపాడుకునే అవకాశం ఉన్నప్పటికీ, తన స్నేహితురాలికి తోడుగా నిలిచేందుకే ఆమె మొగ్గు చూపింది.ప్రస్తుతం ఆ ఇద్దరు బాలికలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడిన లక్ష్మికి వైద్య సేవలు అందిస్తున్నారు. తోటి విద్యార్థిని చూపిన ధైర్యం, త్యాగం నిజమైన స్నేహానికి, శౌర్యానికి నిదర్శనంగా నిలిచాయి. మా ప్రభుత్వం ఈ ఇద్దరు బాలికల కుటుంబాలకు పూర్తి అండగా ఉంటుంది. వారికి అత్యుత్తమ వైద్యం అందేలా చూస్తాం. ఆంధ్రప్రదేశ్‌లోని ఏ చిన్నారి కూడా తరగతి గదిలో అభద్రతా భావానికి గురికాకూడదనే లక్ష్యంతో తగిన చర్యలు తీసుకుంటామని' నారా లోకేష్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.నిందితుడికి సర్జరీ.. కాళ్లు తొలగించనున్న డాక్టర్లురాప్తాడు రంపం దాడి నిందితుడు హేమంత్ అటవీ ప్రాంతంలో పారిపోతుండగా పోలీసులు చుట్టుముట్టారు. అతడు రాళ్లతో, కత్తితో సీఐపై దాడికి యత్నించడంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం 6 రౌండ్ల కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను అనంతపురం ఉఉఱ ఆసుపత్రికి తరలించారు. అతడి కాళ్లలోకి 3 బుల్లెట్లు దిగడం, తీవ్ర రక్తస్రావం కావడంతో 4 యూనిట్ల రక్తం ఎక్కించారు.

ఆంధ్రప్రదేశ్‌లో రూ. 2,254 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవే..



ఆంధ్రప్రదేశ్ ఏపీలో మరో నేషనల్ హైవే విస్తరణకడప టు రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవేతిరుపతికి త్వరగా వెళ్లొచ్చుఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హైవేలు, రోడ్లపై కేంద్రం ఫోకస్ పెట్టింది.. కేంద్రం సహకారంతో హైవే విస్తరణ ప్రాజెక్టుల్ని చేపట్టారు. కడప టు చెన్నై హైవేలో కొన్నేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు దాదాపు 50 కిలోమీటర్ల రోడ్డు దెబ్బతింది. శేషాచలం అడవి, ప్రమాదకర మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరిగేవి. అందుకే కడప టు చెన్నై హైవేను రెండు వరసలు నుంచి నాలుగు వరుసలుగా విస్తరించాలని ఐదేళ్ల క్రితం నిర్ణయించింది. అయితే పనులు మాత్రం ప్రారంభంకాలేదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎన్‌హెచ్-716లో కడప-రేణిగుంట సెక్షన్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. మొత్తం122 కిలోమీటర్లకు గాను అంచనా వ్యయం రూ. 2,254 కోట్లుగా ఉంది.కేంద్రం నేషనల్ హైవే 716కి అనుసంధానంగా కడప నుంచి రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ప్లాన్ చేసింది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ తగ్గించొచ్చని భావించారు. కడప, భాకరాపేట, ఒంటిమిట్ట, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, మామండూరు మీదుగా రేణిగుంట వరకు నాలుగు లైన్లుగా హైవేను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ రోడ్డులో కడప నుంచి రేణిగుంట వెళ్లేందుకు నాలుగు గంటల సమయం పడుతోంది. ఈ హైవే విస్తరణ పూర్తయితే కేవలం రెండు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. అలాగే వాహనాల రద్దీ తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అలాగే ప్రజా రవాణాతో పాటుగా వ్యవసాయ, వాణిజ్య రంగాలకు ఉపయోగంగా ఉంటుందంటున్నరు.2021లోనే కేంద్రం ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. 2024 వరకు అసలు పనులు ప్రారంభించలేదు. కేంద్రంతో సంప్రదింపులు జరపకపోవడంతో పాటుగా అటవీశాఖ అనుమతులు రావడంలేదన్న కారణాలతో పనులు పక్కన పెట్టారు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 అక్టోబరులో పనులు ప్రారంభించారు.. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలన్న టార్గెట్ పెట్టుకున్నారు. అటవీ శాఖ అనుమతులతో పాటుగా నిధుల విడుదల, భూసేకరణ, పరిహారం పంపిణీ పూర్తి చేశారు. ప్రస్తుతం కడప జిల్లాలో పనులు స్పీడ్ అందుకున్నాయి. అలాగే రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ భూమిలో చెట్ల తొలగింపు కొనసాగుతోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే తిరుపతి, చెన్నై వెళ్లేవారికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కడప నుంచి రేణిగుంటకు.. అక్కడి నుంచి తిరుపతికి రెండున్నర గంటల్లోనే వెళ్లొచ్చన్నారు. మొత్తానికి 2027 నాటికి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్ని పూర్తి చేయలనే లక్ష్యంతో పనుల్ని మరింత వేగవంతం చేశారు.

పులివెందుల పులి అన్నారు.. ఓటేయకుండా వెళ్లారు

- జగన్‌పై అచ్చెన్న విమర్శలు
- పులివెందులలో ఓటు హక్కు వినియోగించుకోని జగన్ఇది జగన్ రాజకీయ పిరికితనానికి నిదర్శనమన్న అచ్చెన్నాయుడు
- ఓటమి భయంతోనే వైసీపీ హింసను ప్రేరేపిస్తోందని విమర్శ



పులివెందుల పులి అని గొప్పలు చెప్పుకునే వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకోకుండానే వెనుదిరిగారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. ఇది జగన్ రాజకీయ పిరికితనానికి నిదర్శనమని, ప్రజల తీర్పును ఎదుర్కొనే ధైర్యం లేకే ఎన్నికల ప్రక్రియను వివాదాస్పదం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన స్పందించారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తి, కనీసం తన ఓటు హక్కును కూడా వినియోగించుకోలేకపోవడం సిగ్గుచేటని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోవడం చేతకాక, హింసాత్మక వాతావరణం సృష్టించి లబ్ధి పొందాలని వైసీపీ చూస్తోందని ఆరోపించారు. మహిళలు, వృద్ధులు స్వేచ్ఛగా ఓటు వేయడానికి వస్తుంటే వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు, బెదిరింపులతో భయోత్పాతానికి పాల్పడుతున్నాయని అన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు జరగడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులివెందుల జగన్ కుటుంబానికి రాజకీయ జాగీరు కాదని, అక్కడి ప్రజలు ఎవరికీ బానిసలు కారని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రజలను భయపెట్టి ఓట్లు పొందే రోజులు పోయాయ న్నారు. ఓటు వేయడానికి వచ్చి, అది కూడా చేయకుండా వెనుదిరిగిన వ్యక్తి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ప్రజల తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. పులివెందులలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కేంద్రాలు ఖరారు

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి
- ఐదు రెవెన్యూ డివిజన్లలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు

కడప : జిల్లాలో త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఐదు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బి.కోడూరు, మైదుకూరు, సాకన్, బి.మట్టం, గోపవరం, కలసపాడు, పోరుమామిళ్ల మండలాలకు బద్వేల్‌లోని అంబేద్కర్ గురుకులాన్ని కేంద్రంగా ఖరారు చేసినట్లు తెలిపారు.జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మైలవరం, దువ్వూరు, పెద్దముడియం, ప్రొద్దుటూరు మండలాలకు జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను కేంద్రంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు కడపలోని మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని కేటాయించినట్లు వెల్లడించారు.పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని లింగాల, పులివెందుల,వేముల, వేంపల్లె మండలాలకు పులివెందులలోని జెడ్పీహెచ్ఎస్,రామనప్ప సత్రం, అన్నకాలమగుడు పాఠశాలను కేంద్రంగా ఖరారు చేసినట్లు తెలిపారు.రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నందలూరు, రాజంపేట,టి.సుండుపల్లి, వీరబల్లి మండలాలకు రాజంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కేంద్రంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.ఖరారు చేసిన కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో బారికేడ్లు, ఇతర భద్రతా ఏర్పాట్లను పంచాయతీరాజ్ శాఖ కార్యనిర్వాహక, సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు నిబంధనల ప్రకారం పర్యవేక్షించాలని సూచించినట్లు పేర్కొన్నారు.ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించి నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

జనరల్ ఇన్సూరెన్స్ రిటైర్స్ అసోసియేషన్

జనరల్ బాడీ సమావేశం

హైదరాబాద్ ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థల పరిరక్షణతో పాటు పెన్షనర్ల హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు అవసరమని జనరల్ ఇన్సూరెన్స్ రిటైర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. హైదరాబాద్ అబిడ్స్‌లో నిర్వహించిన అసోసియేషన్ రెండో జనరల్ బాడీ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ సుధాకర్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థ, సామాజిక భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. వాటి స్వతంత్రత, ఆర్థిక పటిష్టత, ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు అందించే సేవలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రైవేటీకరణ ఒత్తిళ్లను ఎదుర్కొని ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని కోరారు. రిటైరీల గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ భారాన్ని తొలగించాలని, పెన్షన్ కమ్యూటేషన్ జరిగిన 11.3 ఏళ్ల తర్వాత పూర్తి పెన్షన్ పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

హిజ్రా హత్యకేసు నిందితుడు అరెస్టు



నిర్మల్ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్లో అర్ధరాత్రి సమయంలో జోగిని సుధాకర్ స్వామిని దారుణంగా హత్య చేసి, అతని వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, వెండి, నగదు మరియు హరియర్ కారును అపహరించి మధ్యప్రదేశ్కు పారిపోతున్న నిందితుడిని నిర్మల్ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.ఈ ఘటనకు సంబంధించి నిర్మల్ జిల్లా పోలీసులకు సమాచారం అందడంతో, రాత్రి విధుల్లో ఉన్న నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, సూర్యభాను, రఘు, శ్రీధర్లతో కలిసి సోన్ టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను గమనించిన నిందితుడు పారిపోవడానికి ప్రయత్నించగా, పోలీసులు వెంటాడి పటుకున్నారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 1.4 కిలోల బంగారం, 3 కిలోల వెండి, రూ.9 లక్షల నగదు మరియు హరియర్ కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం యాదాద్రి జిల్లా పోలీసులకు అప్పగించారు. ఈ సాహసోపేతమైన చర్యలో పాల్గొని నిందితుడిని పట్టుకున్న నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి మరియు పోలీసు సిబ్బందిని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల, అభినందించారు.

రీ పోలింగ్ కేంద్రం దగ్గర ఉద్రిక్తత

అనంతపురం అనంతపురం రీ-పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం ఉదయం ఉద్రిక్తత నెలకొంది. 30వ డివిజన్ 3వ పోలింగ్ బూత్‌లో రీ-పోలింగ్ జరిగింది. ఆదివారం టీడీపీ కూటమి నేతలు రిగ్గింగ్ చేయడం తో అధికారులు మళ్లీ పోలింగ్ నిర్వహించారు. ఈ సారి బీజేపి నేతలు దొంగ ఓట్లు, సైక్లింగ్ కు అనుమతించాలని బెదిరింపులు చేసారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

మద్యం మత్తులో ఉన్మాదం

- ఐదేళ్ల కొడుకును గొంతు నులిమి చంపిన తండ్రి

హైదరాబాద్ బోరబండ శిల్పినగర్‌లో దారుణం జరిగింది. మద్యం మత్తులో తండ్రి విద్యాసాగర్ (36) ఐదేళ్ల కుమారుడు విజయ్ గొంతు నులిమి హత్య చేసినట్లు సమాచారం. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఘటన జరగగా క్యాటరింగ్ పనికి వెళ్లిన తల్లి దుర్గ సోమవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా బాలుడు అప్పటికే మృతి చెందాడు. ?? పొరుగున వున్న స్తానికులు పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు సమాచారం అందగానే నిందితుడు విద్యాసాగర్ పరారైయాడు.

ఆర్టీసీ బస్సుల కోసం అందోళన

సంగారెడ్డి ఆర్టీజీ బస్సుల కోసం ప్రజలు రోడ్డెక్కారు. సంగారెడ్డి జిల్లా అందోల్ బస్టాండ్ వద్ద గ్రామస్తులు, ప్రయాణికులే అందోళనకు దిగారు. బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదంటూ ప్రజలు ఆరోపించారు. నాందేడ్-అఖోలా ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేసారు. ఆర్టీసీ ఆర్ఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు నినాదాలు చేసారు. అందోళనతో ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి అందోళనకారులను సముదాయించి పంపివేసారురు.

రైలు బ్రిడ్జ్ డిమాండ్ చేస్తూ ఫుట్‌కేసర్ బంద్

మేడ్చల్ రైల్వే వంతెన కోసం ఫుట్‌కేసర్ బంద్ జరిగింది. రైల్వే వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజలు బంద్ నిర్వహించారు. బంద్‌కు మద్దతుగా దుకాణాలు మూసివేసారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. 18 ఏళ్లుగా పోరాడుతున్నా పరిష్కారం లేదని స్థానికులు ఆరోపించారు. వెంటనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేసారు.

వచ్చే నెలలో పెళ్లి.. అంతలోనే మృత్యువు కబళించింది

- ఎంతో ఇష్టపడి కొనుక్కున్న డ్రీమ్ వెహికిల్‌లోనే చివరి ప్రయాణం..



విశాఖపట్నం జీవితంలో కొత్త అధ్యాయానికి అడుగుపెట్టాల్సిన యువకుడిని మృత్యువు అర్ధాంతరంగా బలితీసుకుంది. వచ్చే నెలలో పెళ్లి జరగాల్సి ఉండగా జరిగిన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. నాతయ్యపాలెం ప్రాంతంలో కిమ్స్ ఆసుపత్రి వెనుక ఉన్న చెరువులోకి ఓ థార్ వాహనం దూసుకెళ్లింది.

అర్ధరాత్రి సమయంలో షీలానగర్‌లోని కొత్త ఫ్లాట్‌కు వెళ్తుండగా మలుపు వద్ద వాహనం అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో మురళీనగర్‌కు చెందిన వరుణ్ (26) మృతి చెందాడు.ఎంతో ఇష్టపడి కొనుక్కున్న తన డ్రీమ్ వెహికిల్‌లోనే స్నేహితుడి ప్రాణాలు పోవడంతో మిత్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. వచ్చే నెలలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు ఇలా విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

మందమరి మండలంలో నవంబర్ 3వ తేదీన

కరువు ప్రాంతాల్లో సిపిఐ జిల్లా బృందం పర్యటన

- అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి
- నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలి
- నవంబర్ 10వ తేదీన కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

మందమరి సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గం మరియు మండల ,మున్సిపాలిటీ కార్యదర్శుల సమావేశం నిర్వహించడం జరిగినది ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య అధ్యక్షతన జరిగినది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవెన శంకర్ పాల్గొని మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడం వలన పంటలు లేకపోవడం వలన రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు జిల్లాలో 11కరువు మండలాలుగా మధ్యస్థని ప్రకటించినప్పటికీ మిగతా ఏడు మండలాల్లో కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగినది ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో నిత్యవసర సరుకులు విపరీతంగా పెరిగి పేద ప్రజలు కొనలేని పరిస్థితి దాపరించింది ఉన్నటువంటి నిత్యవసర సరుకులు బియ్యాన్ని వ్యాపారస్తులు ఈ ప్రభావాన్ని ఆసరా చేసుకొని హద్దు అదుపు లేకుండా ఎక్కువ రేట్లలో విక్రయించడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు బ్లాక్ దందా చేసినటువంటి వ్యాపారస్తులపై అధికారులు కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు జిల్లాలో ఉన్నటువంటి మిల్లర్లు హోల్సేల్ రిటైల్ షాపు వ్యాపారస్తులు ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలను ధరల పట్టిక బోర్డులను ప్రతి మిల్లర్ వ్యాపారస్తులు షాపు ముందు ఏర్పాటు చేయాలని వారు కోరారు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైనటువంటి చర్యలను ప్రభుత్వ అధికారులు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను కోరారు బ్లాక్ మార్కెట్ దందా చేసే వ్యాపారస్తులపై అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి.

రూ.లక్షతో మొదలై రూ.కోటికి..

చిన్న వ్యాపారంతో నెలకు రూ.6 లక్షలు ఆదాయం..

- తిరుపతికి చెందిన మహిళ సక్సెస్ స్టోరీ
- ఇద్దరితో మొదలై 20మందికి ఉపాధి
- నెలకు ఏకంగా రూ.6లక్షలు ఆదాయం

తిరుపతి ఇటీవల కాలంలో మహిళలు వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. కుటీర పరిశ్రమల స్థాయి నుంచి కార్పొరేటర్ రేంజ్‌కు ఎదుగుతున్నారు. తిరుపతి జిల్లాలో కూడా ఓ మహిళ వినూత్నంగా ఆలోచించి వ్యాపారంలో రాణిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే నినాదంతో ఆమె అడుగులు ముందుకు వేశారు. ఇద్దరుగా మొదలైన మహిళ వ్యాపార ప్రస్థానం నేడు 20మందికి ఉపాధి కల్పించే వరకు ఎదిగింది. ఇతర రాష్ట్రవలు మాత్రమే కాదు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి వీరి ఉత్పత్తులు చేరాయి.తిరుపతి జిల్లా కరకంబాడికి చెందిన కె హేమావతి డిగ్రీ వరకు చదివారు. ఆమెకు 20 ఏళ్ల క్రితం వచ్చిన ఓ ఐడియా జీవితాన్నే మార్చేసింది. ఆమె సన్ పేపర్ ఇండస్ట్రీస్ పేరుతో పేపర్ బ్యాగుల తయారీ పరిశ్రమను ప్రారంభించారు. పర్యావరణానికి హాని కలగకుండా.. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ మార్గంగా పేపర్ బ్యాగులు తయారు చేయాలని భావించారు. అలా మొదలైన తొలి ప్రస్థానం విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఆర్డర్లకు తగిన విధంగా.. అవసరాలను బట్టి బ్యాగుల పరిమాణం, నాణ్యత, తయారీ విధానంలో మార్పులు చేస్తూ ఆర్డర్లు స్వీకరిస్తున్నారు.సన్ పేపర్ ఇండస్ట్రీస్‌లో తయారు చేసిన బ్యాగులు తెలుగు రాష్ట్రాలతో పాటుగా పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడుకు వీరి ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయి. అలాగే దుబాయ్, కువైట్, మస్కట్, ఒమన్, షార్జా వంటి విదేశీ మార్కెట్లకు వీరి ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారు. హేమావతి తన భర్త ప్రోత్సాహంతో రూ.లక్ష పెట్టుబడితో ఈ పరిశ్రమను ప్రారంభించగా.. ఇప్పుడు ఇది రూ.కోటి విలువైన యంత్రసామగ్రితో ఉంది. కేంద్రం అందిస్తున్న ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల) పథకాలనుకూడా ఉపయోగించుకున్నారు. రూ.48 లక్షల రుణం తీసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేశారు. హేమావతి ఇప్పుడు నెలకు రూ.6 లక్షల వరకు సంపాదిస్తున్నారు.

ప్రజల ఆశీర్వాదంతో చిట్వేలి జడ్పీటీసీగా విజయం సాధిస్తా



చిట్వేలి ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలతో చిట్వేలి జెడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధిస్తానని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎల్‌వి మోహన్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవంతో పాటు ప్రజలతో ఉన్న సత్సంబంధాలు తనకు విజయాన్ని అందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, వివిధ పదవుల్లో పనిచేస్తూ ప్రజలకు చేరువయ్యారు. స్థానిక సమస్యలపై అవగాహన, గ్రామాల అభివృద్ధిపై ఆసక్తి తనకు కలిసివచ్చే అంశాలని భావిస్తున్నారు. 1987లో జరిగిన తొలి మండల పరిషత్ ఎన్నికల సమయం నుంచే మోహన్ రెడ్డి రాజకీయ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొనడం ప్రారంభించారు. తన బావ నాగిరెడ్డి నరసింహారెడ్డి ఎంపీగా ఎన్నికవడంలో కీలక పాత్ర పోషించారు. అప్పటి నుంచి చిట్వేలి మండల రాజకీయ పరిణామాలను దగ్గరగా గమనిస్తూ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. రాజకీయ అనుభవాన్ని పెంపొందించుకుంటూ ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. 2005లో భార్య సిద్ధమ్మ చిట్వేలి మండల పరిషత్ అధ్యక్షురాలుగా ఎన్నిక కావడానికి కీలకపాత్ర పోషించారు. అనంతరం దేవమాచుపల్లె గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. 2006, 2012 సంవత్సరాల్లో సర్పంచ్‌గా ఎన్నికై గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల అవసరాల గుర్తింపు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై దృష్టి సారించారు. 2021లో మరోసారి సర్పంచ్‌గా ఎన్నికై ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వర్తించారు. స్థానిక సంస్థల్లో వివిధ పదవులు నిర్వహించిన అనుభవం తనకు ప్రజా సమస్యలపై స్పష్టమైన అవగాహన కల్పించిందని మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయడమే తన ప్రధాన లక్ష్యమని చెబుతున్నారు. జెడ్పీటీసీగా ఎన్నికైతే మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటాననే విశ్వాసాన్ని ఓటర్లలో కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలు, గతంలో నిర్వహించిన ప్రజాప్రతినిధి పదవులు తనకు బలమని తెలుపుతూ, ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆదరణే తన రాజకీయ బలమని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని చెబుతున్నారు.

పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్రతుపాను

విజయవాడ పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్రతుపాను ఏర్పడింది. గడచిన 6 గంటల్లో గంటకు 14 కిమీ వేగంతో తీవ్ర తుపాన్ కదులుతోంది. సోమవారం మద్యాహ్నానికి నెల్లూరుకు 120 కిమీ,కావలికు 140 కిమీ, తిరుపతి 170కిమీ,ఒంగోలుకు 180 కిమీ,బాపట్లకు 200 కిమీ, దూరంలో కేంద్రీకృతం అయింది. బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. దక్షిణ కోస్తా , రాయలసీమ మిగతా జిల్లాల్లోనూ అక్కడక్కడ భారీ వర్షాలు పడతాయి. మంగళవారం తెల్లవారుజాము సమయంలో మధ్య ఒంగోలు సమీపంలో తీరాన్ని దాటే అవకాశం వుంది. తుపాను దగ్గరకు వచ్చే కొద్ది అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

బియ్యం సర్కార్ ధరకే

సివిల్ సప్లయ్ అధికారి: శ్రీనివాస్.





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) గత కొంత కాలంగా తెలంగాణ రాష్ట్రంలో "ఎల్ నినో"ప్రభావం కారణంగా నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని తాకుతున్నాయనే నేపథ్యంలో తెలంగాణ సర్కార్ సమీక్ష సమావేశం నిర్వహించారు.సాక్షత్తూ సిఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగి సివిల్ సప్లయ్ అధికారులతో ధరల పెరుగుదల పై చర్చించారు.అలాగే కూరగాయలు,నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణ పై పూర్తి ఫోకస్ చేయాలని సిఎం అధికారులకు సూచించారు.యుద్ధప్రాతిపదికన జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు జంటనగరాల్లో ఉన్న మార్కెట్ యార్డులు, హోల్ సేల్ షాపుల్లో సైతం తనిఖీలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లోని హోల్ సేల్ బియ్యం దుకాణాలపై పౌరసరఫరా విభాగ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న సమాచారంతో తెలంగాణ ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బోయిన్ పల్లి మార్కెట్ లో హోల్ సేల్,రిటైల్ ధరలకు బియ్యం విక్రయించే దుకాణాల వద్ద ప్రభుత్వ నిర్ణీత ధరలకు సంబంధించిన పట్టికను ఏర్పాటు చేశారు.అలాగే మార్కెట్ లోని వివిధ దుకాణాలలో తనిఖీలు నిర్వహించిన అధికారులు ప్రతి దుకాణం వద్ద ధరల పట్టికను బ్యానర్లను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అధిక ధరలకు బియ్యాన్ని విక్రయించే వారి పట్ల చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించి హోల్ సేల్, రిటైల్ ధరలకు బియ్యం అమ్మాలని వ్యాపారస్తులకు దుకాణదారులకు జిల్లా పౌరసరఫర అధికారి శ్రీనివాస్ సూచించారు.

సచ్చిదానంద స్వామిని ఎందుకు ఆహ్వానించారో జవాబు చెప్పాలే...

- ప్రజల బాగు కోసమైతే ధన్వాడలో పూజలు ఎందుకు చేసిండ్ల..
- ఇంటి దోష నివారణకు పీఠాధిపతిని తీసుకువచ్చిన ఎమ్మెల్యే దుద్దిళ్ల...
- ప్రజా సంక్షేమానికి విస్మరించి కోట్ల రూపాయలు వృధా చేసిన ఎమ్మెల్యే...
- నీళ్లు కరెంటు లేక అల్లాడి పోతున్న రైతులకు ఏం మేలు జరిగిందో చెప్పాల- ...
- మంథని ఎమ్మెల్యేను ప్రశ్నించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు



మంథని (ప్రశ్న న్యూస్) పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిని మంథనికి ఎందుకు ఆహ్వానించారో ప్రజలకు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం చెప్పాలని మంథని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ పీఠాధిపతిని తీసుకువచ్చి ప్రవచనాలు చెప్పించడంతో ప్రజలకు జరిగిన మేలు ఏంటన్నారు. పీటాధిపతి గణపతి సచ్చి దానంద స్వామిని మంత్రి శ్రీధర్ బాబు ఇంటి దోష నివారణకు పూజలు చేయించడానికి తీసుకువచ్చారే కానీ ప్రజల బాగుకు కోసం కాదని వారు ఆరోపించారు. ప్రజల బాగుకోసం పూజలు చేయాల్సి వస్తే ఎమ్మెల్యేసొంత గ్రామమైన ధన్వాడలో ఎందుకని ప్రశ్నించారు. నియోజకవర్గ ప్రజలు ఐదు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అదే ధన్వాడలో గాని కాటారం మండల కేంద్రంలో ఒక్క బస్సు స్టాండ్ కట్టలేదని విమర్శించారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన మంథని ఎమ్మెల్యేను మా నాయకులు ప్రశ్నిస్తే భజన బ్యాచ్‌తో తిట్టించడం ఎంతవరకు సమంజసమన్నారు.

ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి ఐన రేవంత్ రెడ్డి గారు ప్రతిసారి మా అధినేత కెసిఆర్ గారిని తిట్టటం మానుకోవాలని హితవు పలికారు. ఆనాడు ఎన్నికల సమయంలో అధికారం, పదవుల కోసం 420హమీలు ఇచ్చి వాటి అమలును మర్చిపోయారని, వారంటీ లేని గ్యారెంటీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన ఘనత మీది కాదా అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ సుపరిపాలన అందించారని, రైతు సంక్షేమానికి పెద్దపీట వేసి రైతుబంధు, రైతుబీమాలాంటి పథకాలను పకడ్బందీగా అమలు చేసి చరిత్రలో నిలిచారని కొనియాడారు. ఈనాడు రైతు సంక్షేమాన్ని విస్మరించి రైతుబంధు, రైతుబీమాలకు ఎగనామం పెట్టారన్నారు. రైతు సంక్షేమానికి రూపాయి ఖర్చు చేయకుండా ఈనాడు పీఠాధిపతి పర్యటనకు ఐదు కోట్లు ఖర్చు చేశారని వారు ఆరోపించారు. ఐదుసార్లు అవకాశం ఇస్తే మంథని ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన చేయలేదని, ఏ ఒక్క పేదబిడ్డ పెండ్లి చేశావా, కనీసం పుస్తె మట్టెలు ఇచ్చావా, ఓ నిరుపేదకు వైద్యఖర్చులకు సొంతంగా నాలుగు రూపాయలు ఇచ్చావా,, ఓ పేద కుటుంబానికి నీడ కల్పించావా అని సూటిగా ప్రశ్నించారు. పీఠాధిపతి రాకకోసం ఖర్చు చేసిన డబ్బులను పేద ప్రజల బాగు కోసం వినియోగిస్తే బాగుండేది కాదా అని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఏపీలోని 12 పోలింగ్ స్టేషన్‌లలో

రీపోలింగ్ ప్రారంభం

అనంతపురంలోని 30వ వార్డులో 30/3 పోలింగ్ స్టేషన్‌కు రీపోలింగ్ సోమవరం ఉదయం ప్రారంభమయింది. ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని 14వ వార్డులో 14/1 పోలింగ్ స్టేషన్‌కు రీపోలింగ్.. మాచర్లలో వార్డు నం.23లో 23/1, 23/2 పోలింగ్ స్టేషన్‌లకు రీపోలింగ్.. పులివెందులలో 1,3,7,8 వార్డులలో 1/1, 3/1, 7/1, 8/1 పోలింగ్ స్టేషన్లలో రీపోలింగ్.. కడపలో 15వ వార్డులోని 15/2 పోలింగ్ స్టేషన్‌కు రీపోలింగ్ జరిగింది.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ కసరత్తు.. రేసులో ఉన్నది వీరే!

హైదరాబాద్ : తెలంగాణలో నవంబర్ 14తో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సందడి మొదలైంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని మూడు స్థానాలను భర్తీ చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే పలువురు నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల సందడి మొదలైంది. నవంబర్ 14తో ఖాళీ కానున్న మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన నేతలు ఇప్పుడు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి కేటాయించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ రేసులో దొమ్మాటి సాంబయ్య, నాగరిగారి ప్రీతమ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, చారుకొండ వెంకటేష్, కూడా తమ ప్రయత్నాలు చేస్తున్నారు.ఇక ఓసీ కోటాలో బ్రాహ్మణ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలనే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వర్గం నుంచి హార్కర వేణుగోపాల్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా.. దయాసాగర్ పేరు కూడా చర్చలో ఉంది.మరోవైపు బీసీ సామాజికవర్గం నుంచి భారీగా ఆశావహులు ఉన్నారు. పద్మశాలి వర్గానికి అవకాశం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఈ రేసులో ఈరవత్రి అనిల్, కైలాష్ నేత, సంగీశెట్టి జగదీశ్వర్, జక్కని అనితతో పాటు మరికొందరి పేర్లు వినిపిస్తున్నాయి. యాదవ సామాజికవర్గం నుంచి చరణ్ కౌశిక్ యాదవ్, లోకేష్ యాదవ్, లింగం యాదవ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. మహిళా ప్రాతినిధ్యం కోణంలో సునీత రావు పేరు వినిపిస్తోంది.మొత్తంగా మూడు ఎమ్మెల్సీ స్థానాల భర్తీలో సామాజిక సమీకరణాలే కీలకం కానున్నాయి. పదవులు దక్కని నేతలకు ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అవకాశం కల్పించే అంశం కూడా చర్చకు వస్తోంది. అయితే చివరకు కాంగ్రెస్ అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందనేది ఉత్కంఠగా మారింది

జూబ్లీహిల్స్, తార్నక.. మితిమీరుతున్న సౌండ్ పొల్యూషన్

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలో శబ్ద కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, చివరకు నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన జోన్లలోనూ అనుమతించిన పరిమితులకు మించి శబ్దాలు నమోదవుతున్నాయి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి 2026 జనవరి నుంచి జులై వరకు సేకరించిన గణాంకాలు ఈ పరిస్థితిని వెల్లడిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో పగలు, రాత్రి వేళల్లోనూ శబ్ద స్థాయిలు నిర్దేశిత ప్రమాణాలను దాటుతున్నాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, తార్నాకలోని నివాస ప్రాంతాల్లో పర్యవేక్షణ జరిగిన కాలమంతా అనుమతించిన స్థాయికి మించి శబ్ద కాలుష్యం నమోదైంది. వాణిజ్య ప్రాంతమైన జేఎన్‌టీయూలోనూ ఇదే పరిస్థితి కొనసాగగా.. అబిడ్స్‌లో పలు నెలలపాటు రాత్రి వేళల్లో పరిమితులు ఉల్లంఘించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.నగరంలో శబ్ద కాలుష్యానికి వాహనాల రాకపోకలు, అనవసర హారన్ల మోత ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. అధిక శబ్దంతో మోగించే డీజేలు, నిర్మాణ పనులు, ఫంక్షన్ హాళ్లలో జరిగే కార్యక్రమాలు కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. రోడ్డు భద్రత కార్యకర్త అరుణ్ బతులా తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితికి ముందు ఆయన ట్రాఫిక్ పోలీసులతో కలిసి సచివాలయం సమీపంలోని తెలంగాణ తల్లి కూడలిలో గంటపాటు శబ్ద స్థాయిలను పరిశీలించారు. ఆ సమయంలో 82 నుంచి 110 డెసిబెల్స్ వరకు శబ్దం నమోదైంది. నిరంతరం వినిపించే హారన్లను ఎలా భరిస్తున్నారని అక్కడి సిబ్బందిని అడిగితే, ఆ శబ్దాలకు అలవాటు పడిపోయామని కొందరు చెప్పినట్లు ఆయన వివరించారు. మరికొందరు నిద్రలోనూ హారన్ల శబ్దాలు వినిపిస్తున్నాయని చెప్పడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.అనవసరంగా హారన్లు మోగించకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ తెలిపారు. హెచ్‌సీఎస్‌సీ వాలంటీర్ల సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అదనపు మల్టీ హారన్లు అమర్చిన వాహనాలపై క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, హారన్లే శబ్ద కాలుష్యానికి ప్రధాన కారణమని, శివారు ప్రాంతాల్లో నిర్మాణ పనుల వల్ల శబ్దం ఎక్కువగా ఉంటోందని వివరించారు. నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన చోట్ల కూడా పరిస్థితి మెరుగ్గా లేదు. జూ పార్కులో పగటి వేళల్లో అనుమతించిన శబ్ద పరిమితి 50 డెసిబెల్స్ కాగా.. జనవరిలో 56.6 డెసిబెల్స్‌గా నమోదైన స్థాయి జులై నాటికి 61.5 డెసిబెల్స్‌కు చేరింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిసరాల్లోనూ శబ్ద స్థాయిలు సుమారు 70 డెసిబెల్స్‌గా ఉండగా.. జులైలో 71.3 డెసిబెల్స్‌కు చేరాయి. రోడ్డు రవాణా వల్లే మొత్తం శబ్ద కాలుష్యంలో సుమారు 60 నుంచి 70 శాతం వాటా ఉంటుందని రోడ్డు భద్రత నిపుణుడు లోకేంద్ర సింగ్ తెలిపారు. గతంలో అనుమతించిన స్థాయికి మించి శబ్దం చేసే వాహనాలను గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు అకౌస్టిక్ కెమెరాల ప్రయోగం చేపట్టారని, వాటి ద్వారా శబ్ద తీవ్రతను కొలిచి నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు ఈ-చలానాలు జారీ చేసే అవకాశం ఉండేదని వివరించారు. అయితే ఆ ప్రయత్నం ముందుకు సాగలేదన్నారు. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలతోపాటు ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలు, నిరంతర తనిఖీలు, ఉల్లంఘనలపై కఠిన చర్యలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్ పోర్స మెంట్ దాడుల్లో హోటల్స్

హైదరాబాద్ : భాగ్యనగరంలో బిర్యానీ, చాయ్, రుచికరమైన వంటకాల కోసం నిత్యం వేలాది మంది క్యూ కట్టే ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్ల అసలు బండారం ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక దాడుల్లో బట్టబయలైంది. టీజీ సేఫ్ విభాగం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 22 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు గోల్కొండ, చార్మినార్ జోన్లలో ఏకకాలంలో భారీ తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో నగరంలో అత్యంత పేరుగాంచిన షాగౌస్, హోటల్ నయాబ్, మెహఫిల్, సొహైల్ వంటి రెస్టారెంట్ల వంటగదుల్లో కనిపించిన దృశ్యాలు అధికారులనే నివ్వెరపరిచాయి.ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి తీవ్రమైన అపరిశుభ్రత, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన మొత్తం 14 ప్రముఖ రెస్టారెంట్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులను అధికారులు తక్షణమే సస్పెండ్ చేస్తూ, వాటి కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల సందర్భంగా ప్రముఖ హోటళ్ల వంటగదుల్లో వెలుగుచూసిన పరిస్థితులు భయానకంగా ఉన్నాయి. కుళ్ళిపోయిన కూరగాయలు, ఫంగస్ పట్టిన ఆహార పదార్థాలు, ఎక్స్‌పైరీ అయిపోయిన సరుకులను యథేచ్ఛగా వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పచ్చి మాంసాన్ని, శాకాహార వంటకాలను నిబంధనలకు విరుద్ధంగా ఒకేచోట నిల్వ ఉంచడం, ఒకసారి వాడిన నూనెనే మళ్లీ మళ్లీ మరిగిస్తూ వంటలు చేస్తుండటం బయటపడింది.అన్నింటికంటే దారుణంగా.. వంటగదుల్లో ఎలుక రెట్టలు, బొద్దింకలు, ఈగలు స్వైరవిహారం చేస్తుండగా, కొన్నిచోట్ల కిచెన్లలో పిల్లులు తిరుగుతున్నట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. మురుగునీటి నిల్వలు, గ్రీజుతో పేరుకుపోయిన చిమ్నీలు, చితికిపోయిన ఫ్లోరింగ్ నడుమ.. సిబ్బంది కనీసం ఆప్రాన్లు, హెయిర్‌నెట్స్ కూడా ధరించకుండా ఆహారాన్ని తయారు చేస్తున్నారు.లైసెన్సులు రద్దయిన 14 రెస్టారెంట్లలో శాలిబండలోని షాగౌస్ కేఫ్, నయాపూల్ హోటల్ నయాబ్, సంతోష్‌నగర్ లక్కీ రెస్టారెంట్, దిల్?సుఖ్?నగర్ మెహఫిల్, మలక్‌పేట్ సొహైల్ రెస్టారెంట్‌లతో పాటు టోలిచౌకి, సంతోష్ నగర్‌లలోని శ్రీ రాఘవేంద్ర ఉడిపి వెజ్ హోటళ్లు, గుడిమల్కాపూర్‌లోని శ్రీ బాలాజీ ఫ్యామిలీ ధాబా, సిద్దిఖ్ కబాబ్ సెంట్రల్ కిచెన్, టోలిచౌకి అల్బబా, మాసబ్ ట్యాంక్ డైన్ హిల్, ఎంజేఆర్ రోడ్డులోని అక్షయ టిఫిన్స్, వెంకటేశ్వర హోటల్, రేతిబౌలిలోని అజీబో రాయల్ అరేబియన్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇవన్నీ తక్షణమే తమ కార్యకలాపాలను నిలిపివేయాల్సిందేనని అధికారులు తేల్చిచెప్పారు.అలాగే, ఇంజిన్ బౌలిలోని ప్రతిష్టాత్మక తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, శాలిబండ పిస్తా హౌస్, చార్మినార్‌లోని హోటల్ సబ్జీ, మండి ఎట్ 36 అరేబియన్ కిచెన్, సంతోష్‌నగర్ స్పీకార్ హోటల్, మాసబ్ ట్యాంక్ గోల్కొండ హోటల్ అండ్ రిసార్ట్స్, టోలిచౌకి ఇంపీరియల్ మల్టీక్యూసిన్ రెస్టారెంట్, బజార్‌ఘాట్ తైబా బేకరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరారు.

కృష్ణానదిలో మల్లేశ్వరం ద్వీపం

మహబూబ్ నగర్ : నల్లమల అటవీ అందాలు, కృష్ణానది పరవళ్లు, ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనంతో ప్రత్యేక గుర్తింపు పొందిన కొల్లాపూర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. సోమశిల, మల్లేశ్వరం ప్రాంతాల్లో రూ.57.63 కోట్లతో పనులు చేపట్టారు. సోమశిల ఆలయంలో రూ.6 కోట్లతో వసతి, క్యాంటీన్, పిల్లల ఆటస్థలం ఏర్పాటు చేస్తున్నారు. మల్లేశ్వరం ద్వీపంలో రూ.47.44 కోట్లతో 30 కాటేజీలు, స్పా, వాచ్‌టవర్, బోటింగ్ సదుపాయాలు కల్పిస్తున్నారు. బోటింగ్ పనులు పూర్తికాగా, ఇతర పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.చుట్టూ పచ్చని నల్లమల అటవీ ప్రాంతం.. చెంతనే పరవళ్లు తొక్కే కృష్ణానది.. ఒకేచోట ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం.. ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక వైభవం కలగలిసిన కొల్లాపూర్ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. తెలంగాణలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల, పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం ప్రాంతాల్లో సుమారు రూ.57.63 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాయి. ఆర్నెల్లుగా కొనసాగుతున్న ఈ పనులు పూర్తయితే పర్యాటకులకు బస, బోటింగ్, వినోదం, ఆధ్యాత్మిక సందర్శన వంటి అనేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.కొల్లాపూర్ మండలంలోని సోమశిల శ్రీలలితా సోమేశ్వర ఆలయం ఈ ప్రాంతానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ ఆలయంలోనే ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకునే అవకాశం ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించేందుకు రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నాలుగు డార్మిటరీ గదులు, ప్రసాద పంపిణీ కేంద్రం, క్యాంటీన్, చిన్నపిల్లల కోసం ఆటస్థలం ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న పనులు సుమారు 50 శాతం పూర్తయ్యాయి. వీటితో కుటుంబ సమేతంగా వచ్చే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు కలగనున్నాయి.మరోవైపు పెంట్లవెల్లి మండలం మల్లేశ్వరం వద్ద కృష్ణానదిలో ఉన్న ద్వీపాన్ని ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.47.44 కోట్లు మంజూరు చేసింది. ద్వీపం ప్రకృతి అందాలను ఆస్వాదించేలా 30 కాటేజీలు, స్పా ఏరియా, వాచ్‌టవర్, బోటింగ్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. నదీ జలాల మధ్య ప్రకృతి ఒడిలో సేదతీరాలనుకునే పర్యాటకులకు ఈ ప్రాంతం ప్రత్యేక అనుభూతిని అందించనుంది. ప్రస్తుతం ఐలాండ్ అభివృద్ధి పనులు సుమారు 30 శాతం పూర్తయ్యాయి. జూన్ నాటికి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పర్యాటకశాఖ ఏఈఈ తెలిపారు.సోమశిలకు వచ్చే పర్యాటకులకు బోటింగ్ ప్రధాన ఆకర్షణగా ఉంది. కృష్ణానదిలో పడవ ప్రయాణం ద్వారా నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించే అవకాశం ఉండటంతో పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వీఐపీ పుష్కరఘాట్ వద్ద రూ.1.69 కోట్లతో బోటింగ్ సంబంధిత పనులను పూర్తి చేశారు. అదనంగా రూ.2.50 కోట్లతో బోటింగ్ షెడ్డు నిర్మించాల్సి ఉంది. ఘాట్ వద్ద పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తే పడవ ప్రయాణం మరింత సులభతరం కానుంది. ప్రస్తుతం పుష్కరఘాట్ అభివృద్ధి పనులు 40 శాతం పూర్తయ్యాయి.మొత్తంగా కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన రూ.57.63 కోట్ల పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం రూ.10.19 కోట్లు కేటాయించింది. సోమశిల, మల్లేశ్వరం ప్రాంతాల్లో వివిధ పనులను దశలవారీగా చేపడుతున్నారు. ఇప్పటివరకు బోటింగ్ పనులు పూర్తికాగా.. ఆలయ అభివృద్ధి పనులు సగం, పుష్కరఘాట్ పనులు 40 శాతం, మల్లేశ్వరం ఐలాండ్ పనులు 30 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.ప్రకృతి అందాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, నదీ విహారం, ద్వీప పర్యాటకం ఒకేచోట ఉండటం కొల్లాపూర్ ప్రత్యేకత. సోమశిల ఆలయ దర్శనంతో పాటు మల్లేశ్వరం ద్వీపంలో బస, బోటింగ్, నల్లమల ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టులు పూర్తయితే నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కొల్లాపూర్ మరో ఆకర్షణీయమైన విహార గమ్యస్థానంగా మారనుంది.

జనగామ రైల్వేస్టేషన్‌కు నయాలుక్..

- రూ.25 కోట్లతో ఆధునిక హంగులు

వరంగల్ : అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద రూ.25 కోట్లతో జనగామ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం, సాంస్కృతిక చిత్రాలు, విస్తరించిన ప్లాట్‌ఫాంలు, ఏసీ?నాన్ ఏసీ వెయిటింగ్ హాళ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు అందుబాటులోకి వచ్చాయి. అయితే స్టేషన్ ఆవరణలో కోతుల బెడద, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వినియోగంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.తెలంగాణలో రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా జనగామ రైల్వేస్టేషన్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద సుమారు రూ.25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సికింద్రాబాద్?కాజీపేట రైలుమార్గంలో కీలకంగా ఉన్న ఈ స్టేషన్ ఇప్పుడు ఆధునిక హంగులు, ఆకర్షణీయమైన నిర్మాణాలు, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలతో కొత్త శోభను సంతరించుకుంది. గతంలో సాధారణ రూపంలో కనిపించిన స్టేషన్ ప్రాంగణం ప్రస్తుతం విశాలమైన ప్రవేశ మార్గాలు, సుందరీకరణ, ఆధునిక వసతులతో ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.స్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు భవన గోడలపై స్థానిక సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక చిత్రాలు రూపొందించారు. ఆలయ గోపురాలను తలపించే నిర్మాణ శైలి స్టేషన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రాంగణంలో విశాలమైన రహదారులు, టైల్స్‌తో నిర్మించిన నడక మార్గాలు, పచ్చిక బయళ్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచేలా సుందరీకరణ పనులు చేపట్టారు. దీంతో స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్లాట్‌ఫాంలను విస్తరించి ఆధునికీకరించారు. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ, నాన్-ఏసీ వెయిటింగ్ హాళ్లను ఆధునిక ఫర్నీచర్‌తో సిద్ధం చేశారు. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు సులభంగా వెళ్లేందుకు గతంలో ఉన్న పాత వంతెన స్థానంలో విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు లిఫ్టులను అందుబాటులోకి తెచ్చారు. వీటి ద్వారా ప్లాట్‌ఫాంల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయప్రయాణికులకు సమాచారాన్ని వేగంగా అందించేందుకు డిజిటల్ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. రైళ్ల రాకపోకల వివరాలు స్పష్టంగా వినిపించేలా అనౌన్స్‌మెంట్ వ్యవస్థను మెరుగుపరిచారు. టికెట్ల కొనుగోలు కోసం ఆధునిక బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. స్టేషన్ లోపలి ప్రాంతాలతో పాటు బయట కూడా సుందరీకరణ పనులు చేపట్టడంతో మొత్తం ప్రాంగణం కొత్త రూపును సంతరించుకుంది. గతంలో కనీస వసతుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు ఇప్పుడు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అయితే స్టేషన్ ఆధునికీకరణతో పాటు కొన్ని సమస్యలను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించి ప్లాట్‌ఫాంల మధ్య వెళ్లేటప్పుడు కొంత ఇబ్బంది ఎదురవుతోందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా స్టేషన్ ఆవరణలో కోతుల సంచారం అధికంగా ఉండటంతో ప్రయాణికులు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదను నివారించేందుకు రైల్వే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మొత్తంగా రూ.25 కోట్లతో ఆధునికీకరించిన జనగామ రైల్వేస్టేషన్ ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందించే దిశగా ముందడుగు వేయగా.. మిగిలిన సమస్యల పరిష్కారంతో ప్రయాణ అనుభవం మరింత మెరుగుపడనుంది.

ఏపీలో మరో విషాదం..

కేజీబీవీ హాస్టల్‌లో విద్యార్థిని మృతి.

- జి.కొత్తపల్లిలో ఇంటర్ విద్యార్థిని మృతితో కలకలం..
- చేతిపై రాతలున్నట్లు సమాచారం

జి.కొత్తపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న జాజిమొగ్గల ఉష్రశ్రీ హాస్టల్ గదిలో మృతి చెందింది. ఆమె ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు సమాచారం.విద్యార్థిని చేతిపై మృతికి సంబంధించిన కాం˘ణాలు రాసి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఘటనకు గల పూర్తి కారణాలు ఇంకా తెలియరాలేదు.సంబంధిత అధికారులు విచారణ చేపట్టి పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.



షారుఖ్ ఖాన్ పుట్టినరోజు కానుక

'కింగ్' నుంచి తొలి పాట విడుదల, రొమాన్స్‌తో పాటు యాక్షన్ అదుర్స్



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తన 61వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేక కానుక అందించారు. ఆయన నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'కింగ్' నుంచి తొలి పాట 'తూ మిల్ జాయే'ను చిత్రబృందం విడుదల చేసింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో షారుఖ్ సరసన దీపికా పదుకొణే కథానాయికగా నటిస్తున్నారు. రొమాన్స్, యాక్షన్ అంశాలను కలగలిపి రూపొందించిన ఈ పాట విడుదలైన వెంటనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. 'తూ మిల్ జాయే' పాట ప్రారంభంలోనే షారుఖ్ ఖాన్ తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంటోంది. "నేను హంతకుడిని కాదు.. ప్రేమికుడిని" అంటూ ఆయన చెప్పే మాటలతో పాట మొదలవుతుంది. ఆ తర్వాత ప్రకృతి అందాల మధ్య షారుఖ్, దీపికా పదుకొణే మధ్య సాగే రొమాంటిక్ సన్నివేశాలు కనువిందు చేస్తాయి.ఇదే సమయంలో ప్రత్యర్థులతో షారుఖ్ తలపడే యాక్షన్ దృశ్యాలను కూడా పాటలో చూపించారు. చివర్లో ఆయన చెప్పే "ఈసారి గుండెల్లో మంట రగిలింది.. ఇప్పుడు ప్రపంచాన్ని తగలబెట్టకుండా ఆగదు" అనే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. మొత్తంగా ఈ పాటలో ప్రేమ, భావోద్వేగాలు, యాక్షన్‌కు సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పాటకు సచిన్--జిగర్ సంగీతం అందించారు. అరిజిత్ సింగ్, మధుబంతి బాగ్చి తమ గాత్రంతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతర్జాతీయ పాప్ గాయకుడు ఎడ్ షీరన్ ఇంగ్లీష్ ర్యాప్‌తో పాటలో కనిపించడం మరో విశేషం. కుమార్ సాహిత్యం అందించగా, పీయూష్--షాజియా కొరియోగ్రఫీ చేశారు.షారుఖ్, దీపికా మధ్య కెమిస్ట్రీతో పాటు పాటలోని సంగీతం, యాక్షన్ దృశ్యాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తొలి పాటతోనే 'కింగ్' సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'ఓం శాంతి ఓం', 'చెన్నై ఎక్స్‌ప్రెస్', 'హ్యాపీ న్యూ ఇయర్', 'పఠాన్', 'జవాన్' చిత్రాల తర్వాత షారుఖ్ ఖాన్, దీపికా పదుకొణే కలిసి నటిస్తున్న మరో సినిమా 'కింగ్'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో షారుఖ్ కుమార్తె సుహానా ఖాన్, అభిషేక్ బచ్చన్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న 'కింగ్' ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 24న థియేటర్లలో విడుదల కానుంది. షారుఖ్ పుట్టినరోజు సందర్భంగా తొలి పాటను విడుదల చేయడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. రొమాన్స్, యాక్షన్‌తో కూడిన ఈ చిత్రం వెండితెరపై ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలి.


ప్రేమలో దారుణంగా మోసపోయా

– రెజీనా కసాండ్రా



విభిన్నమైన పాత్రలతో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ రెజీనా కసాండ్రా... తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి సంచలన విషయాలు వెల్లడించారు. గతంలో తాను ప్రేమలో దారుణంగా మోసపోయానని, ఆ కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లానని ఆమె తెలిపారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్ 2' (తెలుగులో 'మహాశక్తి') చిత్ర ప్రచార కార్యక్రమాల్లో ఈ వ్యాఖ్యలు చేశారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ... "2020లో నా జీవితంలో ఊహించని ఘటన జరిగింది. నేను ప్రేమించిన వ్యక్తి నన్ను మోసం చేయడంతో ఆ బంధం ముగిసిపోయింది. ఆ పరిణామం నన్ను మానసికంగా కుంగదీసింది. చాలా కాలం డిప్రెషన్‌తో బాధపడ్డాను. ఆ బాధ నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది" అని రెజీనా భావోద్వేగానికి గురయ్యారు. ఈ కష్టకాలం నుంచి బయటపడటానికి తనకు తానే సమయం కేటాయించుకోవడం ఎంతో సహాయపడిందని ఆమె అన్నారు. "ఇతరుల నుంచి ప్రేమను ఆశించే ముందు, మనల్ని మనం ప్రేమించుకోవడం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు. యువతులు లైంగిక వేధింపులు వంటి చేదు అనుభవాలు ఎదుర్కొన్నప్పుడు తమను తాము నిందించుకోవద్దని సూచించారు. బాధను మనసులో దాచుకోకుండా, నమ్మకమైన వారితో పంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె సలహా ఇచ్చారు.

ఆధిపత్య పోరులో 'వేట్టువం'



సామాజిక సమస్యలను కథావస్తువులుగా ఎంచుకొని వాటిని కమర్షియల్ పంథాలోనే బలంగా ఆవిష్కరిస్తుంటారు తమిళ దర్శకుడు పా.రంజిత్. ఆయన దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'వేట్టువం'. ఆర్య, వి.ఆర్.దినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. వివిధ వర్గాలు, సమూహాల మధ్య అధికారం, ఆధిపత్యం కోసం జరిగే పోరాటం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు సమాచారం. గతం, వర్తమానం, భవిష్యత్తు..మూడు కాలాల్ని అనుసంధానిస్తూ ఈ కథ సాగుతుందని, ఇందులో భారీ యాక్షన్ ఘట్టాలతో పాటు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేస్తాయని చెబుతున్నారు. పర్యావరణ విధ్వంసం తాలూకు పరిణామాలను కూడా ఈ కథ చర్చిస్తుందని తెలిసింది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, రచన-దర్శకత్వం: పా.రంజిత్.

'ఫౌజీ' కోసం రంగంలోకి..



ప్రస్తుతం 'కల్కి-2' 'ఫౌజీ' వంటి భారీ చిత్రాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు అగ్ర హీరో ప్రభాస్. ఇటీవల ఆయన పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసిన 'ఫౌజీ' గ్లింప్స్ సినిమాపై మరింతగా అంచనాల్ని పెంచింది. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి కథాంశంతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో ప్రభాస్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఈ నెల 3 నుంచి తిరిగి ఈ సినిమా సెట్‌లో జాయిన్ కాబోతున్నారు ప్రభాస్. ఈ షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కిస్తారని తెలిసింది. వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. మొత్తానికి 'కల్కి-2'తో పాటు 'ఫౌజీ' చిత్రాల్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తూ బిజీగా మారారు ప్రభాస్.

భయపెట్టే 'స్కేరీ పిక్చర్'



బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ హారర్ చిత్రంలో నటిస్తున్నది. తెలుగు దర్శకుడు రవిబాబు రూపొందిస్తున్న ఈ చిత్రానికి రానా దగ్గుబాటి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు 'స్కేరీ పిక్చర్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టాలీవుడ్‌లో విభిన్న కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రవిబాబు..ఈ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన 'హారర్‌కాన్ ఇండియా 2026' కార్యక్రమంలో రానా దగ్గుబాటి ఈ చిత్రాన్ని ప్రకటించారు. కంగనారనౌత్ గతంలో 'రాజ్: ది మిస్టరీ కంటిన్యూస్' 'చంద్రముఖి-2' వంటి హారర్ చిత్రాల్లో నటించారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె హారర్ సినిమాలో భాగం కావడం విశేషం. ప్రయోగాత్మక కథలతో సినిమాలు తీసే రవిబాబు..కంగనారనౌత్ వంటి అగ్ర కథానాయికతో ఎలాంటి హారర్ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం 'క్వీన్-2' 'సర్కిల్' వంటి చిత్రాలతో బిజీగా ఉంది కంగనారనౌత్. మరోవైపు రాజకీయాల్లో కూడా క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నది.

మూడు రోజుల్లోనే
రూ.50 కోట్లకు పైగా వసూళ్లు..

బాక్సాఫీస్ వద్ద వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం' జోరు!



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వచ్చిన కుటుంబ కథా చిత్రం 'ఆదర్శ కుటుంబం' (ఏకే 47) బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా తొలి వారాంతంలోనే సత్తా చాటింది. ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన రావడంతో మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ప్రముఖ సినీ వసూళ్ల విశ్లేషణ సంస్థ సాక్‌నిల్క్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 'ఆదర్శ కుటుంబం' మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.50.95 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఇందులో భారతదేశంలో రూ.36.85 కోట్ల గ్రాస్, రూ.31.40 కోట్ల నికర వసూళ్లు నమోదయ్యాయి. విదేశాల్లో రూ.14.10 కోట్ల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. ఆదివారం ఒక్కరోజే ఏడు లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు ట్రేడ్ వర్గాల అంచనా. తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం ఈ సినిమా రూ.8.8 కోట్ల వసూళ్లు సాధించినట్లు సమాచారం. తొలి వారాంతంలో వచ్చిన ఈ స్పందనతో చిత్ర బృందం సంతోషంగా ఉంది. ఇక ఈ సినిమాలో వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటించారు. యువీనా పార్థవి, రాజా ప్రజ్వల్, నారా రోహిత్, రఘుబాబు, నివేదా పేతురాజ్, సత్య, రావు రమేష్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తమన్ సంగీతం అందించగా, హరిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మించారు. చిట్టిబాబు (వెంకటేశ్), స్వర్ణ (శ్రీనిధి శెట్టి) దంపతులకు సంపూర్ణ (యువీనా పార్థవి), స్వర (రాజా ప్రజ్వల్) అనే ఇద్దరు పిల్లలు. భార్యా పిల్లలే తన ప్రపంచంగా బతికే చిట్టిబాబు సాధారణ బ్యాంకు ఉద్యోగి. భార్య చిట్టీల వ్యవహారంతో అప్పులపాలవుతాడు. మరోవైపు కొడుకు చదువుపై శ్రద్ధ చూపకపోవడం, కూతురు ఓ మెకానిక్‌తో ప్రేమలో పడటం అతడికి కొత్త సమస్యలు తెచ్చిపెడతాయి. ఇలా కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న చిట్టిబాబుకు అనూహ్యంగా రూ.100 కోట్ల లాటరీ తగులుతుంది. దీంతో అతడి కుటుంబం ఒక్కసారిగా సంపన్నంగా మారి గేటెడ్ కమ్యూనిటీకి మారుతుంది. అయితే వారి ఆనందం ఎంతోకాలం నిలవదు. ఉత్తర భారతానికి చెందిన టార్జన్ అనే దోపిడీ ముఠా ఆ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది. కుటుంబ సభ్యులను చంపి డబ్బు దోచుకోవాలని ప్రయత్నిస్తుంది. ఈ ప్రమాదం నుంచి చిట్టిబాబు తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడు? పోలీసు అధికారి దామోదర నాయుడు (నారా రోహిత్) ఏం చేశాడు? గేటెడ్ కమ్యూనిటీలో పరిచయమైన చిత్తరంజన్ (సత్య), మాలతి (నివేదా పేతురాజ్) ఈ వ్యవహారంలో ఎలా కీలకంగా మారారు? చివరికి ఆ కుటుంబానికి ఎదురైన ప్రమాదం నుంచి ఎలా బయటపడ్డారు? అన్నదే మిగతా కథ.

కుటుంబ నేపథ్య ప్రేమకథ



రాజీవ్ వర్మ, మల్లెకా టి వాసుపాల్ జంటగా సకల సమృద్ధి ఆర్ట్స్ పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. గౌతమ్‌ప్రసాద్ యల్లపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కనుమూరి ప్రసాద్‌రాజు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ క్లాప్‌నివ్వగా, నిర్మాత కెమెరా స్విచాన్ చేశారు. ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే లవ్‌స్టోరీ ఇదని, ఈ నెల 12 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని, నాలుగు షెడ్యూల్స్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: గౌతమ్‌ప్రసాద్ యల్లపు.

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో 'ఓట్ బచావో, దేశ్ బచావో' మహా ర్యాలీ

- మహబూబ్ నగర్ యువజన కాంగ్రెస్‌తో

పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంత్ రెడ్డి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన నిర్వహించిన 'ఓట్ బచావో, దేశ్ బచావో' మహా ర్యాలీ ఘనంగా జరిగింది. ఈ ర్యాలీలో తెలంగాణ నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చారు.మహబూబ్ నగర్ జిల్లా యువజన కాంగ్రెస్ సభ్యులతో కలిసి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మహబూబ్ నగర్ ఇన్చార్జ్ శివంత్ రెడ్డి ఈ మహా ర్యాలీలో చురుగ్గా పాల్గొన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కును కాపాడటమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో పాటు ఇండియా కూటమి నేతలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 13.3 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించి బీజేపీకి, ప్రధాని మోదీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపు వెనుక పెద్ద కుట్ర ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఈ ర్యాలీలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్యకర్తలు పాల్గొనడంతో రామ్‌లీలా మైదాన్ కిక్కిరిసిపోయింది.

ఓ ఆర్ ఆర్ బ్రిడ్జి కింద ట్రాన్స్‌జెండర్

అనుమానాస్పద మృతి

- ఆత్మహత్యా.. హత్యా.? తేలాల్సి ఉంది



కీసర(ప్రశ్న న్యూస్) కీసర--ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ బైపాస్ పరిధిలోని రాంపల్లి దాయర--కరీంగూడ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానిక బ్రిడ్జి కింద ఓ ట్రాన్స్‌జెండర్ ఉరివేసుకున్న స్థితిలో మృతిచెంది కనిపించడం కలకలం రేపింది. మృతురాలిని కీసర మండలం బోగారం గ్రామానికి చెందిన స్వీటీ (శేఖర్)గా గుర్తించినట్లు సమాచారం. ఆమె వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిసింది. అయితే మృతికి గల కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఆత్మహత్యా? లేక మరేదైనా కారణంతో మృతి చెందిందా? అనే కోణంలో చర్చ జరుగుతోంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు.సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల విచారణ పూర్తయిన తర్వాతే మృతికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

జగిత్యాల జిల్లాలో బియ్యం అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

- జగిత్యాల జిల్లాలో రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులపై పౌరసరఫరాల శాఖ నిఘా

- ఆకస్మిక తనిఖీలకు ఆదేశాలు

- జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జిల్లాలోని రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులతో పాటు కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి హెచ్చరించారు. మార్కెట్‌లో బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమంగా నిల్వ చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.జిల్లావ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు.వ్యాపారులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను ఆయన వెల్లడించారు.వ్యాపారులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు:రైస్ మిల్లులు, గోదాములు, దుకాణాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా బియ్యం నిల్వ చేయరాదు.ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలి.తనిఖీల్లో అక్రమ నిల్వలు, ధరల ట్యాంపరింగ్, తూకంలో మోసాలు, రికార్డుల నిర్వహణలో అవకతవకలు గుర్తించినట్లయితే సంబంధిత వ్యాపారులపై నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

ఉప్పల్‌లో హత్య కుట్ర భగ్నం:సిపి.సుమతి

- ఆర్ఫాజ్‌ను హతమార్చేందుకు పథకం.. ఐదుగురిని అరెస్టు చేసిన ఉప్పల్ పోలీసులు

- రెండు నాటు తుపాకులు,8 తూటాలు, మూడు కత్తులు స్వాధీనం... మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి





హైదరాబాద్(ప్రశ్న న్యూస్) మనస్సును రగిల్చే పాత కక్షలు..ప్రతీకారేచ్ఛ.. హత్యకు కుట్ర! ఓ వ్యక్తిని హతమార్చేందుకు పథకం సిద్ధం చేసుకున్న ఐదుగురిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు.ఉప్పల్ పోలీసులతో కలిసి ఎస్‌వోటీ ఎల్బీనగర్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఈ కుట్ర వెలుగుచూసింది. నిందితుల నుంచి రెండు నాటు తుపాకులు,8 తూటాలు,మూడు కత్తులు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆటోతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సిపి సుమతి విలేకరుల సమావేశంలో తెలిపారు.

మూసీ పరివాహక ప్రాంతంలో అనుమానాస్పదంగా

నవంబర్ 2న ఉదయం ఉప్పల్ శిల్పారామం వెనుక మూసీ నది సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు,ఓ ఆటోతో ఐదుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఇద్దరి వద్ద రెండు నాటు తుపాకులు,8 తూటాలు, మూడు కత్తులు లభించాయి.విచారణలో ఆర్ఫాజ్ అనే వ్యక్తిని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు.

పాత హత్యలకు ప్రతీకారంగా మరో హత్యకు కుట్ర

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. దాసరి సురేందర్ అలియాస్ సూరి తన భార్య షబా పై అనుమానంతో ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలున్నాయి. అనంతరం 2024లో షబా సోదరుడు సల్మాన్‌ను కూడా హత్య చేసినట్లు కేసులున్నాయి.ఈ క్రమంలో షబా మరో సోదరుడు ఆర్ఫాజ్.. జులై 2026లో సురేందర్‌ను హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో జైలుకు వెళ్లిన ఆర్ఫాజ్ ఇటీవల విడుదలయ్యాడు. దీంతో సురేందర్ అనుచరులుగా ఉన్న ఐదుగురు అతడి పై ప్రతీకారం తీర్చుకోవాలని హత్యకు కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైంది.

బీహార్ నుంచి తుపాకుల కొనుగోలు

కుట్రలో భాగంగా తనయ్ కుమార్ అలియాస్ కన్నా, షేక్ అక్బర్ కలిసి ఆదిత్య కుమార్ ఠాకూర్‌కు ఫోన్‌పే ద్వారా రూ.35 వేల నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు.ఆదిత్య బీహార్‌లోని భాగల్పూర్ జిల్లా సైద్‌పూర్ దభ్రా ప్రాంతానికి వెళ్లి గుర్తు తెలియని వ్యక్తి నుంచి రూ.30 వేలకు రెండు నాటు తుపాకులు,ఆరు తూటాలు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు వెల్లడించారు.మూడు కత్తులను కూడా కొనుగోలు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అప్రమత్తతతో తప్పిన ఘోరం

ఆర్ఫాజ్‌ను హతమార్చే పథకాన్ని అమలు చేసేందుకు ఐదుగురు నవంబర్ 2న ఉదయం మూసీ నది సమీపంలో సమావేశమయ్యారు. అయితే ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవడంతో హత్య కుట్ర భగ్నమైందని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి పేర్కొన్నారు.

నిందితుల వివరాలు.

1)తొకట తనయ్ కుమార్ అలియాస్ కన్నా (26) -- లోన్ రికవరీ ఏజెంట్ గా ఉద్యోగం చేస్తున్నాడు.ఉప్పల్ నివాసిగా గుర్తించిన పోలీసులు.2)షేక్ అక్బర్ (26) -- ఆటో డ్రైవర్ ఆయన జీవనోపాధి ఈయన మీర్‌పేట వాసి.3)ఆదిత్య కుమార్ ఠాకూర్ (33) -- సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు.4)దుడాని లక్ష్మణ్ సింగ్ అలియాస్ సోను (27) -- వెల్డింగ్ కార్మికుడు కొత్తపేట వాసి.5)వద్ద్యా వెంకటేశ్ అలియాస్ నాని (22) -- ఆటో డ్రైవర్,అల్మాస్‌గూడ.వీరిలో లక్ష్మణ్ సింగ్ చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్నట్లు,అతడిపై గతంలో 30 క్రిమినల్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.అందులో రెండు హత్య కేసులు కూడా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం,వ్యక్తిగత కక్షలతో హత్యలకు కుట్ర పన్నడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మల్కాజిగిరి పోలీసులు హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసిన సిపి.బి. సుమతి.

భాగ్యనగరంలో కాషాయ ఉప్పెన

జనసంద్రమైన బీజేపీ 'మహా పాదయాత్ర'

- హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో హాజరైన అశేష జనవాహిని - పాల్గొన్న కేంద్రమంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ - స్టేట్ బ్యూరో చీఫ్ తేజవ్యాస్)



భారత హోంశాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ లో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే ధ్యేయంగా సోమవారం మధ్యాహ్నం సుడిగాలి పాదయాత్ర నిర్వహించారు. ఆయన నేతృత్వంలో మహానగరంలో నిర్వహించిన మహా పాదయత్రకు వేలాది సంఖ్యలో బీజేపీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు తరలివచ్చి కదం తొక్కారు. అడుగుడుగునా జై బీజేపీ నినాదాలతో మార్మోగిన యాత్ర మార్గం..ఎటు చూసినా కాషాయ జెండాలతో రెప రెపలాడింది. సర్ పై ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ, ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తున్న కాంగ్రెస్, ఇండీ కూటమి రాజకీయాలకు గట్టి సమాధానమిచ్చేలా నిజాం కాలేజ్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మొజంజాహి మార్కెట్ క్రాస్ రోడ్స్ వరకు పాదయాత్ర సాగింది.

ఒకే వ్యక్తికి రెండేసి ఓట్లు ఉండవచ్చా :

అనంతరం భారీ సభను ఉద్దేశించి మాట్లాడిన అమిత్ షా హైదరాబాద్‌ను నిజాం పాలన నుండి విముక్తి చేసి, భారత యూనియన్‌లో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు చేసిన చారిత్రాత్మక కృషిని గుర్తుచేసుకున్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు నిర్మూలించి అర్హులైన భారత పౌరుల ఓట్లు కాపాడేందుకు ఉద్దేశించిన సర్ ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. 13 కోట్ల ఓట్ల తొలగింపుపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ... ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉండటం, మరణించిన వారు, డూప్లికేట్ ఓట్లు, ఆచూకీ లేని ఓటర్ల పేర్లను తొలగించడం వల్లనే ఓటర్ల జాబితాలో మార్పులు జరిగాయని చెప్పారు. అలాంటి పేర్లు ఓటర్ల జాబితాలో ఎందుకు ఉండాలని ఆయన నిలదీశారు.బీజేపీ ఎన్నికల విజయాలకు సర్ కారణమన్న రాహుల్ గాంధీ వాదనను అమిత్ షా తిప్పికొట్టారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ గారు గెలిచినప్పుడు ఎలాంటి సర్ ప్రక్రియ జరగలేదని గుర్తుచేశారు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో బీజేపీ విజయాలు ప్రజల మద్దతు వల్లే సాధ్యమయ్యాయని స్పష్టం చేశారు.

దమ్ముంటే సర్ పై ప్రత్యేక సమావేశానికి రండి :

సర్, ఈవీఎంలు అక్రమ చొరబాట్లు, కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు లేవనెత్తిన ఇతర అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి బీజేపీ సిద్ధంగా ఉందని దమ్ముంటే హాజరు కావాలని రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలకు సవాల్ విసిరారు. పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడం మానేసి, అర్థవంతమైన చర్చల్లో పాల్గొనాలని కాంగ్రెస్‌కు హితవు పలికారు. తెలంగాణ, కేరళ, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడులో కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు గెలిచినప్పుడు ఈవీఎంలను అంగీకరించిన రాహుల్ గాంధీ, బీజేపీ గెలిచినప్పుడు మాత్రం ఈ ప్రక్రియను ఎందుకు ప్రశ్నిస్తున్నారని నిలదీశారు.

కాంగ్రెస్ పార్టీ కనుమరుగు :

దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ప్రాభవం కోల్పోతోందని, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, త్రిపుర, ఒడిశాలో దశాబ్దాలుగా ఆ పార్టీ అధికారానికి దూరంగా ఉందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఓటములకు సర్ కారణం కాదని, ప్రజలు తిరస్కరించడమే అనే విషయాన్ని గుర్తు పెట్టుకుంటే మంచిదన్నారు.

ఢిల్లీ కాంగ్రెస్'కి తెలంగాణ ఏటీఎంలా మారింది

కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చేశారని, రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలు తెలంగాణను ఎలా వాడుకుంటున్నారో ఎండగట్టారు. కాంగ్రెస్ ఇచ్చిన 'ఆరు గ్యారంటీలు' కనీసం ఒక్కటి కూడా సరిగా అమలు కాని విషయాన్ని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉగ్రవాదం మరియు నక్సలిజంపై ఉక్కుపాదం మోపిన వైనాన్ని గుర్తుచేశారు. భారతదేశాన్ని డ్రగ్స్ రహిత దేశంగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

తెలంగాణలో బీజేపీ సర్కారుకు నాంది :

బీజేపీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పని చేయాలని పిలుపునిస్తూ.. తెలంగాణలో కాంగ్రెస్‌ను కూకటి వేళ్లతో సహా పెకిలించి, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ మహా పాదయాత్రలో బీజేపీ తెలంగాణ అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోడం నగేశ్, అరవింద్ ధర్మపురి, డాక్టర్ కె. లక్ష్మణ్, ఎం. రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు ఎ. మహేశ్వర్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పాయల్ శంకర్, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, సి. అంజిరెడ్డి, పార్టీ నేతలు ఇతర ప్రముఖులు భాగస్వామ్యం అయ్యారు.

అన్నదానం పేరుతో అక్రమ వసూళ్ల పర్వం

▶ అన్నవరం దేవస్థానంలో భక్తుల విశ్వాసంతో వ్యాపారమా.? ▶ రిటైర్డ్ ఉద్యోగి--కొందరు పురోహితుల పాత్రపై ఆరోపణలు.?

▶ రసీదులు లేకుండానే నగదు సేకరణ జరుగుతోందా.? ▶ దేవస్థానం పేరుతో విరాళాల వసూళ్లకు అధికారిక అనుమతులున్నాయా.?



అన్నవరం(ప్రశ్న న్యూస్) అన్నదానం.. ఆకలితో వచ్చిన భక్తుడికి అన్నం పెట్టే పవిత్ర సేవ. దైవసన్నిధిలో భక్తితో సమర్పించే విరాళం.. భగవంతుడికి చేసే సేవగా భావిస్తారు. అలాంటి పవిత్ర కార్యక్రమం పేరుతోనే కొందరు వ్యక్తులు భక్తుల నుంచి అక్రమంగా నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో చర్చనీయాంశంగా మారాయి. భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని అన్నదానం పేరుతో డబ్బులు సేకరిస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.దేవస్థానం అధికారికంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి విరాళాలు ఇవ్వాలనుకునే భక్తులకు నిర్దిష్ట విధానం, రసీదు, లెక్కలు ఉండాలి. అయితే కొందరు వ్యక్తులు దేవస్థానంతో తమకున్న పరిచయాలను ఉపయోగించుకుని వ్యక్తిగతంగా నగదు సేకరిస్తున్నారా? పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగి ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల్లో వాస్తవమెంత? కొందరు పురోహితులు, వృత్తి పురోహితుల ద్వారా భక్తులను సంప్రదించి అన్నదానం పేరుతో డబ్బులు తీసుకుంటున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పరిచయాల మాటున వసూళ్లా..

దేవస్థానంలో గతంలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగికి ఆలయ వ్యవహారాలు, సిబ్బంది, భక్తుల రాకపోకలపై పరిచయాలు ఉండవచ్చు. ఆ పరిచయాలను ఉపయోగించుకుని దేవస్థానం అధికారిక కార్యక్రమాల పేరుతో విరాళాలు సేకరిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇందులో కొందరు పురోహితులు, మధ్యవర్తుల ప్రమేయం ఉందా? భక్తులను సంప్రదించే విధానం ఏమిటి? నగదు ఎవరికి అందుతోంది? సేకరించిన మొత్తాన్ని ఎక్కడ జమ చేస్తున్నారు? అన్న అంశాలపై స్పష్టత రావాలి.

పుణ్యఫలం పేరుతో ప్రలోభాలా..

స్వామివారి సన్నిధిలో అన్నదానం చేస్తే విశేష పుణ్యఫలం లభిస్తుందని భక్తులకు చెప్పడం తప్పు కాదు. కానీ ఆ విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని డబ్బులు ఇవ్వకపోతే సేవ చేయలేరన్నట్లుగా ఒత్తిడి చేయడం, ప్రత్యేక పుణ్యం పేరుతో అధిక మొత్తాలు అడగడం జరిగితే అది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. ఒకే భక్తుడిని అన్నదానం, ప్రత్యేక పూజలు, ఇతర సేవల పేరుతో పలుమార్లు సంప్రదిస్తున్నారా? భక్తుల ఫోన్ నంబర్లు, చిరునామాలు సేకరించి తిరిగి విరాళాల కోసం ఫోన్లు చేస్తున్నారా? అన్నది కూడా పరిశీలించాలి.

రసీదు ఎక్కడ? లెక్కలు ఎవరి దగ్గర..

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్న నగదు లావాదేవీలకు సంబంధించినదే. భక్తులు ఇచ్చే విరాళాలకు దేవస్థానం అధికారిక రసీదులు అందుతున్నాయా? లేక వ్యక్తిగతంగా నగదు తీసుకుంటున్నారా? అధికారిక రసీదు లేకుండా సేకరించిన మొత్తానికి లెక్కలు ఎవరు నిర్వహిస్తున్నారు? విరాళాలు నిజంగానే అన్నదానానికి వినియోగిస్తున్నారా? లేక ఇతర అవసరాల పేరుతో మళ్లిస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది. సేకరించిన మొత్తంలో మధ్యవర్తులకు కమీషన్లు లేదా వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు ఉంటే వాటిపై ఆర్థిక లావాదేవీల ఆధారంగా విచారణ జరపాలి.

అధికారుల దృష్టికి రాలేదా..

దేవస్థానం పరిసరాల్లోనే ఈ తరహా కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తుంటే సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. అన్నదానం పేరుతో విరాళాలు సేకరించేందుకు ఎవరికి అనుమతులు ఇచ్చారు? అనుమతి పొందిన వ్యక్తుల వివరాలు ఏమిటి? దేవస్థానం పేరును ఉపయోగించుకునే హక్కు ఎవరికి ఉంది? అన్న వివరాలను బహిర్గతం చేయాలి. ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలు, భక్తుల ఫిర్యాదులు, నగదు సేకరణకు సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సమగ్ర విచారణతోనే నిజాలు వెలుగులోకి..

దేవస్థానం ఉన్నతాధికారులు ఈ ఆరోపణలను తేలికగా తీసుకోకుండా ప్రత్యేక విచారణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగి పాత్ర, సంబంధిత పురోహితులు, మధ్యవర్తుల వ్యవహారశైలి, అధికారిక అనుమతులు, విరాళాల రసీదులు, బ్యాంకు లావాదేవీలు, అన్నదాన నిర్వహణ ఖర్చులపై సమగ్రంగా పరిశీలించాలి. ఆరోపణలు నిజమని ఆధారాలతో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులపై నిరాధార ఆరోపణలు రాకుండా నిష్పాక్షిక విచారణ జరగాలి.అన్నదానం అనేది వ్యాపారం కాదు.. భక్తి, సేవ, మానవత్వానికి ప్రతీక. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తుల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత దేవస్థానం యంత్రాంగంపై ఉంది. భక్తులు సమర్పించే ప్రతి రూపాయికి పారదర్శక లెక్క ఉండాలి.

కీసరగుట్టలో ఇదేం అపచారం.?

– పవిత్ర పుణ్యక్షేత్రంలో మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాల దర్శనం

– ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రతపై భక్తుల ఆగ్రహం, అధికారుల పర్యవేక్షణ ఏదీ.?







కీసర (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత తాండవిస్తోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో వచ్చి స్వామివారిని దర్శించుకునే పవిత్ర క్షేత్రంలో ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఆధ్యాత్మిక ప్రశాంతతకు నిలయంగా ఉండాల్సిన ఆలయ పరిసరాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపించడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పుణ్యక్షేత్రంలో మద్యం సీసాలా.?

కీసరగుట్ట ఆలయ పరిసరాల్లోని పలు ప్రాంతాల్లో ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు పడివున్నట్లు భక్తులు చెబుతున్నారు. స్వామివారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా వచ్చే భక్తులకు ఇలాంటి దృశ్యాలు ఎదురవుతుండటంతో అసహనం వ్యక్తమవుతోంది. పవిత్రమైన ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఎవరిది.? ఆలయ పరిసరాల్లో ఇలాంటి పరిస్థితులు నెలకొనడానికి కారణాలేమిటి.? ఇక్కడ సెక్యూరిటీ వ్యవస్థ లేదా.? మరి ఈవో, సూపరిండెంట్ అధికారుల పర్యవేక్షణ ఏది.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పర్యవేక్షణ ఎక్కడ.?

ఆలయానికి నిత్యం భక్తుల రాకపోకలు కొనసాగుతున్నప్పటికీ పరిసరాల పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ పరిసరాల్లో మద్యం సీసాలు పడేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పారవేయడం వంటి చర్యలను అడ్డుకోవడంలో సంబంధిత యంత్రాంగం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. కేవలం పండుగలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. అధికారులు రావడం కార్యాలయంలో ఏసీలో కూర్చోవడం తప్ప ఆలయ పరిసరాలను పర్యవేక్షించి కావలసిన సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు సిబ్బంది విధుల పట్ల చేస్తున్న నిర్లక్ష్యాన్ని తెలియజేయాలని కనీస అవగాహన ఈవోకు సూపర్డెంట్ కు లేదా అంటూ భక్తులు మండిపడుతున్నారు.

పవిత్రతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి

ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల నిఘాను పటిష్టం చేయాలని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని భక్తులు సూచిస్తున్నారు. మద్యం సేవించడం, మద్యం సీసాలు పడేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలు పారవేయడం వంటి చర్యలకు పాల్పడేవారిని గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షణ ఏమాత్రం లేదని దేవాలయాలలో నిధులు సైతం గోల్మాల్ అవుతున్నాయి అన్న ఆరోపణలు ఉన్నాయి భక్తులకు ప్రసాదాన్ని కూడా ఇవ్వడం లేదని ప్యాకెట్లలో అమ్ముకోవడం తప్ప అధికారులు చేస్తుంది ఏమీ లేదని భక్తులు మండిపడుతున్నారు.ఇప్పటికైన దేవాదాయ శాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు ఏసీ గదిలో కూర్చోకుండా ప్రతి దేవాలయంలో పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అదేవిధంగా ఆలయ అధికారులు, పోలీసు, పారిశుద్ధ్య విభాగాల అధికారులు స్పందించి కీసరగుట్ట పుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయ పరిసరాల్లో పరిశుభ్రమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



భారత నెం.1 కుబేరుడిగా ముకేశ్ అంబానీ

– ఆరేళ్లలో అతిపెద్ద జంప్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్ ముకేశ్ అంబానీ సంపద సోమవారం ఒక్కరోజే ఉవ్వెత్తున ఎగిసింది. కంపెనీ అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలను ప్రకటించడంతో రిలయన్స్ షేర్లు భారీగా లాభపడ్డాయి. ఈ పరిణామంతో అంబానీ సంపద ఒక్కరోజే బిలియన్ల డాలర్ల మేర పెరిగి, ఆయన తిరిగి భారతదేశంలో అత్యంత సంపన్నుడిగా అవతరించారు. వివరాల్లోకి వెళితే, దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో నవంబర్ 2న రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు మార్కెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. బీఎస్ఈలో రిలయన్స్ షేరు ధర ఏకంగా 11.64% పెరిగి రూ.1,299 వద్ద ముగిసింది. గత ఆరేళ్లలో కంపెనీ షేరుకు ఇది ఒక్కరోజులో అతిపెద్ద లాభం కావడం విశేషం. ఈ ర్యాలీతో నిఫ్టీ 50 సూచీకి రిలయన్స్ అతిపెద్ద కంట్రిబ్యూటర్‌గా నిలిచింది. షేర్ల ర్యాలీ నేరుగా ముకేశ్ అంబానీ నికర సంపదపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఫోర్బ్స్ రియల్-టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం, సోమవారం ఒక్కరోజే అంబానీ సంపద 6.3 బిలియన్ డాలర్ల నుంచి 8.5 బిలియన్ డాలర్ల మధ్య పెరిగింది. దీంతో ఆయన సంపద మొత్తం 88.8 బిలియన్ డాలర్లకు (రూ.8.4 లక్షల కోట్లు) చేరుకుంది. ఈ వృద్ధితో ఆయన ప్రపంచవ్యాప్తంగా ఆ రోజు అత్యధిక సంపదను ఆర్జించిన వ్యక్తిగా (టాప్ గ్లోబల్ గెయినర్) నిలిచారు. ఈ క్రమంలో గౌతమ్ అదానీని వెనక్కి నెట్టి, ఫోర్బ్స్ ర్యాంకింగ్స్‌లో భారత నంబర్ వన్ కుబేరుడిగా తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు.

అక్రమ బోర్లపై హైడ్రా ప్రత్యేక దృష్టి

– అక్రమంగా నీటిని తరలించే కార్యకలాపాలకు అడ్డుకట్ట



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో అక్రమంగా భూగర్భ జలాలను తోడేస్తూ సాగిస్తున్న నీటి వ్యాపారంపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి, నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా తెల్లాపూర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 7 అక్రమ బోర్‌వెల్‌లను పైపులతో సహా తొలగించి, వాటిని పూర్తిగా పూడ్చివేసింది. అలాగే, నీటి నిల్వ కోసం నిర్మించిన 6 భారీ వాటర్ సంపులను కూడా అధికారులు ధ్వంసం చేశారు. నీటి రవాణాకు ఉపయోగిస్తున్న ట్యాంకర్లను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు.భూగర్భ జలాలు అడుగంటిపోకుండా కాపాడటంతో పాటు, స్థానిక ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా నీటి ట్యాంకర్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, తమ ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో హైడ్రా ఈ చర్యలకు ఉపక్రమించింది. హైడ్రా తీసుకుంటున్న చర్యలతో తమకు ప్రాణభయం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటల సమీపంలో జరుగుతున్న అక్రమ నీటి దందాను పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు. అనుమతులు లేని బోర్లపై నిఘా కొనసాగిస్తామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అమిత్ షాతో చిరంజీవి, రామ్ చరణ్ భేటీ

– ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగంపై ఆందోళన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మెగాస్టార్ చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సోమవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. బీజేపీ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అమిత్ షాను, బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో వారు కలిశారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ఓ తీవ్రమైన సమస్యను చిరంజీవి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినీ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఏఐ టెక్నాలజీని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్, మార్ఫింగ్ ద్వారా అసభ్యకరమైన, అభ్యంతరకరమైన కంటెంట్‌ను సృష్టిస్తున్నారని, దీనివల్ల కళాకారులు, ముఖ్యంగా నటీమణులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని వివరించారు. టాలీవుడ్‌తో పాటు యావత్ భారత సినీ పరిశ్రమ తరఫున ఈ సమస్యపై కఠినమైన చట్టాలు తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు.చిరంజీవి చెప్పిన విషయాలను అమిత్ షా సావధానంగా విన్నారు. ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన, దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. టెక్నాలజీని దుర్వినియోగం చేసి కళాకారులు, మహిళల గౌరవానికి భంగం కలిగించే వారిపై కఠినమైన మార్గదర్శకాలు, శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ విషయంపై పూర్తి వివరాలతో లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలని చిరంజీవికి అమిత్ షా సూచించారు. దీనికి సంబంధించిన సమన్వయ బాధ్యతలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అప్పగించారు. హోంమంత్రి సానుకూలంగా స్పందించడంపై చిరంజీవి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకునే చర్యలతో చిత్ర పరిశ్రమకు త్వరలోనే ఊరట లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ భేటీలో చిరంజీవి అమిత్ షాను శాలువాతో సత్కరించి, మెమెంటోను బహూకరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588